ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 22 ఏప్రిల్ 2025 | 5



అమలాపురం **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 36 (సోమవారం)

కనిష్ఠం : 29

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతా మట్టి మనుషులే.. ఇక్కడ వ్యవసాయమే జీవనాధారం.. మట్టినే నమ్ముకున్నారు.. ఉదయం లేచింది మొదలు సాయంత్రం పొద్దుపోయే వరకూ మట్టితోనే ఉంటారు.. అన్నం ఆకలి తీర్చే అమ్మలా భావిస్తారు.. వరాలిచ్చే దేవతగా పూజిస్తారు.. నేడు ధరిత్రీ దినోత్సవం సందర్భంగా అలాంటి మట్టిపై కథనం.. - 6లో

అమ్మా.. అవనీ.. నేల తల్లీ అని..



ఆంధ్రజ్యోతి పంచిన ఆనందం!

ఆంధ్రజ్యోతి అక్షరంతోనే కాదు.. ప్రతి ఏడాది కార్ అండ్ బైక్ రేస్ డ్రా ద్వారా పాఠకులకు ఆనందం పంచుతోంది.. బహుమతులతో పాఠకులను సంతోషపరుస్తోంది.. లక్షలాది కూపన్లు.. 103 బహుమతులు.. పాఠకులంతా మన వరకూ ఏం వస్తుందిలే అనుకున్నవారే. గత నెల 27 ఆంధ్రజ్యోతి లక్కీడ్రా తీశారు.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లికి చెందిన టీఎస్‌వీఎస్ సూర్యనారాయణ మూర్తికి ఫోన్ చేశారు.. హలో.. మేం ఆంధ్రజ్యోతి యూనిట్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాం.. మీరు కార్ అండ్ బైక్ రేస్ డ్రాలో మొదటి బహుమతి బైక్ గెలిచారన్న వెంటనే ఆశ్చర్యపోయారు.. నోట మాట రాలేదు.. ఇలా 103 మందికి ఫోన్లు చేశారు.. ఇలా గెలుపొందిన వారందరికీ ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో సోమవారం రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి బహుమతులు అందజేశారు. దీంతో విజేతలైన పాఠకులు ఆనందం వ్యక్తంచేశారు.. 6



కలిసొచ్చిన అదృష్టం : ప్రథమ బహుమతి బైక్ విజేత సూర్యనారాయణమూర్తికి చెక్ అందజేస్తున్న రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి. చిత్రంలో బీఎం శ్రీనివాసరావు తదితరులు



గొంతెండదంతే!

గ్రామాల్లో తాగునీటి కష్టాలకు చెక్

- తాగునీరందేలా సర్కారు చర్యలు
- 64 సీపీడబ్ల్యూ ట్యాంకులపై దృష్టి
- రూ.66 కోట్ల నిధులు మంజూరు
- పనులకు టెండర్ల ఆహ్వానం
- ఈనెల 28వ తేదీ తర్వాత ఖరారు
- తీరనున్న తాగునీటి వెతలు
- ఏడాదిపాటు పనుల నిర్వహణ
- గతంలో పట్టించుకోని వైసీపీ
- నాడు ట్యాంకులన్నీ నిరుపయోగం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వేసవి వస్తే చాలు..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక పల్లె గొంతులు తాగునీటి కోసం అలమటించే పరిస్థితి. చెంతనే గోదావరి ఉన్నా.. అందుబాటులో మంచినీటి ట్యాంకులు ఉన్నా జనం దాహార్తిని తీర్చలేని దుస్థితి.. ఏటా ఇదే తంతు.. అయినా గత వైసీపీ సర్కారు ఇదేదీ



పట్టించుకోలేదు. అయితే ప్రభుత్వం మారడంతో ఇప్పుడు ఒక్కోటీ గాడిన పడుతున్నాయి. వేసవి రావడంతో జనం గొంతెండే పరిస్థితులు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.66 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీరు పల్లెలకు అందేలా కార్యాచరణకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు 66 సీపీడబ్ల్యూ స్కీం పనులకు సంబంధించి మరమ్మతులు, నిర్వహణ పనులకు టెండర్లు పిలిచింది. ఈవారంలోగా వీటిని పూర్తి చేసి పనులు పట్టాలెక్కించేందుకు చర్యలు చేపట్టింది.

దాహార్తి తీరినట్లే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో మూడు నుంచి నాలుగు గ్రామాలకు కలిపి సమగ్ర రక్షిత మంచినీటి పథకం కింద ఎన్నో ఏళ్ల కిందట ప్రభుత్వం భారీ మంచినీటి ట్యాంకులను నిర్మించింది. సమీప గోదావరి కాలువలు, చెరువులు, కాలువల్లో నీటిని ఈ ట్యాంకులకు అనుసంధానం చేసి అక్కడే శుద్ధిచేసి గ్రామాల్లో ఇళ్లకు పైపులైన్ల ద్వారా కుళాయిలకు నీటిని ఆ శాఖ అధికారులు స్థానిక పంచాయతీల సాయంతో అందించేవారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు తాగునీటి సరఫరాను పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో వేసవి వస్తే చాలు ఉమ్మడి జిల్లాలో అనేక పల్లెలు దాహార్తితో అల్లాడేవి. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడంతో మళ్లీ వ్యవస్థను అధికారులు గాడినపెట్టేందుకు చర్యలు చేపట్టారు. వేసవి ముదరడం.. గ్రామాల్లో దాహార్తి పెరగడంతో మూలనపడ్డ, నిర్వహణకు నోచుకోకుండా ఉన్న సీపీడబ్ల్యూ ట్యాంకులకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని నిర్ణయించారు. ఆర్థిక సంఘం నిధులు ఇతర అవసరాలకు మళ్లించకుండా మంచినీటి ట్యాంకుల మరమ్మతు, నీటిశుద్ధి, పైపులైన్లకు రిపేర్లు వంటివాటికే వెచ్చించాలని ప్రభుత్వం ఆదేశించిది.దీంతో ఉమ్మడి జిల్లాలో రూ.66 కోట్లతో వీటన్నింటికి మరమ్మతు, నిర్వహణకు వీలుగా అధికారులు తాజాగా టెండర్లు పిలిచారు. ఈ నెల 28వ తేదీ నాటికి ఆ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు.

ఏడాదిపాటు ఇబ్బంది లేకుండా..

కాకినాడ జిల్లాలోని ట్యాంకుల మరమ్మతులు, గోదావరి కాలువల నుంచి ట్యాంకులకు వెళ్లే పైపులైన్లు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిర్వహణ తదితర అవసరాలకు రూ.25 కోట్లు వెచ్చించనున్నారు. కోనసీమ జిల్లా మలికిపురంలోని గుడిమెల్లంక స్కీమ్‌కు రూ.78.05 లక్షలు, కొత్తపేట, రావులపాలెం మండలాలకు రూ.77.86 లక్షలు, అంతర్వేదిపాలెం రూ.53.87 లక్షలు, ముమ్మిడివరం రూ.49.66 లక్షలు, ఉప్పలగుప్తం రూ.46.75 లక్షలు, కాట్రేనికోనలోని కందికుప్ప స్కీమ్‌కు రూ.44.05 లక్షలు, ఆత్రేయపురం రూ.36.98 లక్షలు, అమలాపురంలోని బోడసకుర్రుకు రూ.42.90 లక్షలు, పి.గన్నవరం రూ.33.48 లక్షలు, గోడి రూ.36.01 లక్షలు, పేరూరు రూ.28.23 లక్షలు, మురమళ్ల రూ.28 లక్షలు, కాకినాడ జిల్లా నాగులాపల్లి రూ.46.89 లక్షలు, జగ్గంపేట రూ.46.53 లక్షలు, సూర్యారావుపేట రూ.45 లక్షలు, తునిలోని ఏవీ నగరం స్కీమ్‌కు రూ.43.75 లక్షలు, తాళ్లరేవు మండలం పటవల రూ.33.47 లక్షలు, తాళ్లరేవు రూ.32.90 లక్షలు, పెదపూడి రూ.30.93 లక్షలు, ఏలేశ్వరం రూ.43.30 లక్షలు, గొల్లప్రోలు రూ.29.23 లక్షలు, గండేపల్లి రూ.26.92 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండలోని బూరుగుపూడి స్కీ మ్‌కు రూ.40.74 లక్షలు, చాగల్లాడు రూ.30.10 లక్షలు, అనపర్తిలోని కాపవరం స్కీమ్‌కు రూ.28.79 లక్షలు, కడియం పరిసర గ్రామాలకు రూ.76.77 లక్షలు, ఏజెన్సీలోని వై.రామవరం రూ.31.15 లక్షలు, కూనవరం రూ.26.71 లక్షల చొప్పున ఆయా స్కీమ్ ట్యాంకులకు నిధులు కేటాయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం మారిన తర్వాత తాగునీటి బెంగ తీరబోతోంది. మరమ్మతులతోపాటు ఏడాదిపాటు వీటికి ఏ సమస్యా లేకుండా నిర్వహణ బాధ్యత కూడా ఆయా కాంట్రాక్టర్లదే.

ఇదేమి.. విపత్తు!



ప్రమాదాలు చెప్పి వస్తాయా.. ఎటు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో ఎవరికీ తెలియదు.. ప్రమాదం వచ్చే సమయానికి విపత్తు నిర్వహణశాఖ సన్నద్ధంగా ఉండాలి.. అయితే ఉమ్మడి జిల్లాలో విపత్తు నిర్వహణ శాఖ చూస్తే పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది.. పనిచేయని యంత్రాలు.. సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది.. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో కనీసం రెస్క్యూ బోట్లు లేవంటే పరిస్థితి ఎంత దారుణంతో ఉందో అర్థం చేసుకోవచ్చు..

ప్రమాదాలనేం అడికడతారు..

- విపత్తులో అగ్నిమాపకం
- ఒక్కటే రెస్క్యూ బోటు
- 'తూర్పు'లో బోటుకు చిల్లు
- సిబ్బంది లేక ఇబ్బంది
- పనిచేయని యంత్రాలు
- మూడు జిల్లాల్లోనూ ఇంతే
- ప్రమాదం వస్తే చింతే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

విపత్తు సంభవించినప్పుడు మానవ వనరులు, ఇతర పనిముట్లు లేకుండా చేసేదేమీ ఉండదు. అగ్నిమాపక శాఖను కొరతలు వేధిస్తుండడంతో కాగితాల్లో లెక్కలకు వాస్తవ పరిస్థితికి వ్యత్యాసం ఉంటోంది. రెస్క్యూ పరికరాలు మరమ్మతుల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. సగం సిబ్బందితోనే ఇబ్బందులు పడుతూ నెట్టుకురావడం అగ్నికి ఆజ్యం పోస్తోంది. 7 జిల్లాలకు సంబంధించి జోన్-2 ప్రాంతీయ ఫైర్ అధికారి తూర్పుగోదావరిలోనే ఉన్నా సిబ్బంది సరిపడా లేకపోవడం గమనార్హం. తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని అగ్నిమాపక శాఖలో సమస్యలపై కథనం..

కొత్త ఫైర్‌స్టేషన్ల మాటేంటి..

మూడు జిల్లాల్లోని కొత్త ఫైర్ స్టేషన్లు వివిధ దశల్లో పలు సమస్యలతో ఉన్నాయి. ఇటు ప్రజాప్రతినిధులూ పెద్దగా పట్టించుకోకపోవడంతో అందుబాటులోకి ఎప్పుడు వస్తాయనే విషయం చెప్పలేని పరిస్థితి ఉంది. కాకినాడ నగర పరిధిలోని జగన్నాథపురంలో ఫైర్ స్టేషనుకు డోర్లు, ఎలక్ట్రికల్, టైల్స్, పెయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కోనసీమ జిల్లాలోని అమలాపురంలో భవనం పూర్తయింది. పక్కన మట్టి ఫిల్లింగ్ చేయాల్సి ఉంది. మండపేటలో ఎలక్ట్రికల్, శానిటరీ పనులు చేయాలి. పి.గన్నవరంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఫైర్ స్టేషన్ భవన నిర్మాణానికి రూ.1.20 లక్షలు ఇచ్చినా నేటికీ నిధులు విడుదలకు నోచుకోలేదు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో సివిల్ వర్క్ పూర్తయింది. డోర్స్, టైల్స్, ఎలక్ట్రికల్, శానిటరీ, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయి. దేవరపల్లిలో ఫైర్‌స్టేషను నిర్మాణానికి కేటాయించిన స్థలం కోర్టు వివాదంలో ఉండడంతో వేరొక స్థలం కోసం వెతుకులాడుతున్నారు. కాకినాడ జగన్నాథపురం, మండపేట, నిడదవోలుకు బడ్జెట్ కేటాయింపు ప్రకారం నిధులు మంజూరు కావాల్సి ఉంది. అమలాపురానికి అదనపు నిధులు అవసరం. పి.గన్నవరానికి బడ్జెట్ ప్రకారం నిధులు రాలేదు. రాజమహేంద్రవరం రూరల్, గోపాలపురంలలో ప్రభుత్వ అనుమతి వెలువడాల్సి ఉంది. కాకినాడ జిల్లాలో 7, కోనసీమలో 7, తూర్పుగోదావరిలో 6 ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి.

గోదారి వరదలు వస్తున్నా..

గత నెల 4న చీకటి పడిన వేళ గోదావరి లంక నుంచి నాటు పడవలో వస్తూ ప్రమాదానికి గురై ఇద్దరు మృత్యువాత పడ్డారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ ఇంజనుతో అగ్ని మాపక సిబ్బంది పుష్కరాల రేవుకు చేరుకున్నారు. ఉన్న ఒక్క రెస్క్యూ బోట్‌కి చిల్లు పడడంతో ఏం చేయలేకపోయారు. గాలింపునకు నాటు పడవలే దిక్కయ్యాయి. దీంతో 4 గంటల క్లిష్టమైన సమయం గడచిపోయింది. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో అఖండ గోదావరి తీరం ఉంది. ప్రతి ఏడాదీ వరదలు సహజమే. అయినా ఈనాటికీ ఒక్క రెస్క్యూ బోటును సమకూర్చుకోలేని దైన్యంలో విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలశాఖ కొట్టుమిట్టాడుతోంది. కాకినాడలో మెరైన్, నేవీ ఉండడం వల్ల అవసరానికి అక్కరకు వచ్చే అవకాశం ఉంటోంది.

సిబ్బంది కొరత

విపత్తు నిర్వహణ శాఖలో సిబ్బంది కొరత అంతర్గత విపత్తులా మారింది. సిబ్బంది సరిపడా లేకపోవడం వల్ల మిగిలినవారిపైనే భారం పడుతోంది. అత్యవసర సర్వీసు కావడంతో డ్యూటీల్లో వెసులుబాటు ఉండడంలేదు. ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ కాకినాడ జిల్లాలో 161 మందికి 53, కోనసీమలో 114కి 49, తూర్పుగోదావరిలో 119కి 49 మంది ఉన్నారు. మూడు జిల్లాలకు ఇద్దరేసి చొప్పున జూనియర్ అసిస్టెంట్ల పోస్టులు కేటాయింపు ఉంది. కోనసీమ, తూర్పుగోదావరిలో వారూ లేరు. కాకినాడలో సూపరింటెండెంట్ ఉన్నారు. ఆఫీసు పనులను కూడా ఎగ్జిక్యూటివ్ సిబ్బందే చూసుకోవాల్సి వస్తోంది. అధికారులే లెటర్ టైప్ చేసుకొని ప్రింట్ తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

ప్రమాదం జరిగితే అంతేగా!

విపత్తు వేళ సిబ్బంది ఎంత మందిఉన్నా పనిముట్లు, పరికరాలు లేకపోతే సమయం వృథా తప్పదు. కళ్ల ముందే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఉమ్మడి జిల్లాలో అన్నిచోట్లా రెస్క్యూ ఎక్విప్‌మెంట్ కూడా పూర్తి స్థాయిలో లేదు. కొన్ని మరమ్మతుల్లో ఉండగా, మరికొన్ని మూలకు చేరిపోయాయి. మూడు జిల్లాలోని పని చేస్తున్నవి, పక్కన పడి ఉన్నవి ఇలా ఉన్నాయి.

రెస్క్యూ బోట్లు లేవ్

ఐఆర్‌బీలు.. రెస్క్యూబోట్లు కాకినాడలో 3 ఉన్నాయి. రెండు పనిచేయడం లేదు.. మిగిలిన జిల్లాల్లో రెస్క్యూ బోట్లు లేవు.. ప్రమాదం జరిగితే అంతే..

	కాకినాడ	కోనసీమ	తూర్పు	మొత్తం	పనిచేయనివి
విద్యుత్తు రంపాలు	26 -3	28-2	25-2	79	7
ఆస్కాలైట్లు	6-4	2-0	2-0	10	4
లైఫ్‌బాయ్స్	59-0	73-5	36-1	168	6
లైఫ్ జాకెట్లు	49-13	103-0	27-5	179	18
రోప్‌లు	62 -0	28- 3	22-7	112	10
బీఏ సెట్లు	8-3	4-0	8-1	20	4



కలెక్టరేట్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న డీఆర్వో రాజకుమారి

సమస్యల పరిష్కార సరళిపై ఐవీఆర్ఎస్ సర్వే

కలెక్టరేట్‌లో 266 అర్జీల స్వీకరణ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి పేర్కొన్నారు. సమస్యల పరిష్కార సరళిపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. దరఖాస్తుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తిస్తూ సమస్యలను సావధానంగా విని అర్థం చేసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో రాజకుమారితోపాటు ఆర్డీవో కె.మాధవి, డీఆర్డీఏ పీడీ సాయినాథ్ జైచంద్రగాంధీ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఎస్‌డీసీ కృష్ణమూర్తి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 266 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో రాజకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద నుంచి అందిన ప్రజాసమస్యల ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరించాలన్నారు. అర్హతలేని దరఖాస్తులను తిప్పి పంపుతూ అందుకు గల కారణాలను స్పష్టంగా దరఖాస్తుదారునితోపాటు సదరు ప్రజాప్రతినిధికి తెలియజేయాలన్నారు. ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ ప్రతీ మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో అందిన అర్జీలను వెంటనే పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌చేస్తూ పరిష్కరించాలని సూచించారు. డిజిటల్ అరెస్టు అనేది లేదని, ఎక్కడైనా సైబర్ క్రైమ్ జరిగినప్పుడు వెంటనే సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. లేదా 1930 టోల్ ఫ్రీ నంబరుకు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సోషల్ మీడియా పేరిట జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా సహాయ సంచాలకుడు వీవీవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో డీఆర్వో రాజకుమారి ఆరుగురు చెవిటి, మూగ విద్యార్థులు ఒక్కొక్కరికీ రూ.15 వేల విలువచేసే స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేసవి సీజన్‌లో మురుగుకాల్వలను ఆధునికీకరించాలి

కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. మూడు దశాబ్దాల కిందట మేజర్ డ్రెయిన్‌లను ఆధునికీకరించారు. అప్పటి నుంచి పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదు. దీనివల్ల ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులు తుఫానులు, వరదలు, భారీ వర్షాలతో పంటలు నష్టపోతున్నారు. ప్రస్తుత వేసవి సీజన్‌లో జిల్లాలోని అన్ని డ్రెయిన్లను తవ్వించేందుకు అనుమతులిచ్చి పనులు మే నుంచి చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు ధర్నా నిర్వహించాయి. తర్వాత కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చీకట్ల అబ్బాయి, జగ్గప్పరాజు, యార్లగడ్డ రవీంద్ర, అయితాబత్తుల సుభాషిణి, దేశినీడి భాస్కరరావు, వంటెద్దు బాబి, షకీలా పాల్గొన్నారు.



రిలే దీక్షల్లో జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ తదితరులు

వర్గీకరణను నిరసిస్తూ రిలే దీక్షలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట రాక్స్ అండ్ మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ప్రారంభించారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ వెంటనే రద్దు చేయాలని, లేదంటే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని రత్నాకర్ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. నాయకులు చీకురుమిల్లి కిరణ్‌కుమార్, వారా లక్ష్మీనరసింహారావు, కాశి వీర వెంకట సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, జిత్తుక సత్యనారాయణ, పచ్చిమాల శ్రీనివాసరావు, పోతుల సుందరం తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాల సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

బీజేపీ హయాంలోనే అంబేడ్కర్‌కు సముచిత గౌరవం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

అమలాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు బీజేపీ హయాంలోనే సముచిత గౌరవం దక్కిందని కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ మంత్రిగా పనిచేసిన కాలంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగానే ఆయన రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అంబేడ్కర్‌కు సముచిత స్థానం కల్పిస్తూ పార్లమెంటులో నిలువెత్తు ప్రతిమ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బీజేపీ మద్దతుతోనే ఆయనకు భారతరత్న ఇవ్వడం జరిగిందని వివరించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పక్షోత్సవాల ముగింపు సభ సోమవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లోని గంగరాజు ఫంక్షన్ హాలులో నిర్వహించారు. బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి కేంద్ర సహాయ మంత్రి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో తణుకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు ముళ్లపూడి రేణుక మాట్లాడుతూ ఇంతవరకు 108 సార్లు రాజ్యాంగ సవరణ జరిగితే దానిలో 90 పర్యాయాలు కాంగ్రెస్ హయాంలోనే సవరణలు జరిగాయన్నారు. ఆర్టికల్ 370, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి ముఖ్య విషయాలకు మాత్రమే బీజేపీలో చట్ట సవరణలు జరిగాయన్నారు. అంబేడ్కర్ పేరిట ఐదు క్షేత్రాలను పంచ తీర్థాలుగా బీజేపీ ప్రభుత్వం గుర్తించి శాశ్వత అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ ఎన్నో వివక్షతలకు గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ కుమార్, నేతలు యాళ్ల దొరబాబు, తమలంపూడి రామకృష్ణారెడ్డి, కర్రి చిట్టిబాబు, కల్వకొలను తాతాజీ, పాలూరి సత్యానందం, కొప్పుల నాగమానస, యిళ్ల సత్యనారాయణ, ఆర్వీ నాయుడు, అయ్యగారి కృష్ణసుందర్, ఆకుల వీరబాబు, అల్లు భాస్కర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పంచిన ఆనందం



రెండో బహుమతి విజేతకు ఫ్రిడ్జ్, మూడో బహుమతి విజేతకు టీవీ కొనుగోలు పత్రాలు అందజేస్తున్న బీవీఆర్ చౌదరి

- ప్రజల తరపున పోరాడే దమ్మున్న పత్రిక.. ఆంధ్రజ్యోతి
- రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి
- ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ డ్రా విజేతలకు బహుమతులు అందజేత

దివాన్‌చెరువు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మా అక్షరం మీ ఆయుధం అనే నినాదంతో ప్రజల తరఫున పోరాడే ఏకైక దమ్మున్న పత్రిక ఆంధ్రజ్యోతి అని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని ఆంధ్రజ్యోతి జిల్లా యూనిట్ కార్యాలయంలో సోమవారం ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్‌రేస్ డ్రాలో విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. అశేష పాఠకాదరణ ఆంధ్రజ్యోతి సొంతమన్నారు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకులకు బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయం మా రాజానగరం నియోజకవర్గంలో ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రజ్యోతి బీఎం ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠకులను ప్రోత్సహించడానికి కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి కార్‌అండ్ బైక్ రేస్ లక్కీడ్రా నిర్వహిస్తోందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి గతేడాది నవంబరు ఒకటవ తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28వతేదీ మధ్య ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 12 కూపన్లను నాలుగు సెట్లు చేసి పాఠకులు ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపారని తెలిపారు. వాటిని ఇటీవల డ్రా తీసి విజేతలను ఎంపిక చేశామన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండలం మందపల్లికి చెందిన టీఎన్‌వీఎస్.సూర్యనారాయణమూర్తికి ప్రథమ బహుమతిగా బైక్ నిమిత్తం నగదు చెక్కు అందజేశారు. సఖినేటిపల్లి మండలం శృంగవరప్పాడుకు చెందిన అడబాల సత్యనారాయణకు ద్వితీయ బహుమతిగా ఫ్రిడ్జ్ నిమిత్తం కొనుగోలు పత్రం, రామచంద్రపురానికి చెందిన ములసా అప్పలరాజుకు తృతీయ బహుమతిగా 32 ఇంచెస్ టీవీ నిమిత్తం కొనుగోలు పత్రం అందజేశారు. మరో 100మంది విజేతలకు కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి విజేతకు ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కందుల బాబూరాయుడు, టీడీపీ నాయకులు షోడసాని త్రిమూర్తులు, పలివెల లక్ష్మణ్, పెనుగొండ చిన్ని, ఆంధ్రజ్యోతి యాడ్స్ మేనేజర్ పి.వి.కృష్ణారావు, సర్క్యులేషన్ మేనేజర్ బి.గోపాలకృష్ణ, స్టాఫ్ రిపోర్టర్ పి.రమేష్‌నాగేంద్ర, రిపోర్టర్లు ప్రగడ దుర్గారావు, కాదంబరి శ్రీనివాస్, కవిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ బహుమతి వస్తుందనుకోలేదు



ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ డ్రాలో ప్రథమ బహుమతి అందుకోవడం అంతులేని ఆనందం కలిగించింది. పౌరోహిత్యం మా వృత్తి. దాదాపు 22 సంవత్సరాలకు పైగా ఆంధ్రజ్యోతి పాఠకుడను. ఆంధ్రజ్యోతి బైక్ అండ్ కార్ రేస్ కూపన్లు పూర్తి చేసి పంపాను. ఊహించని విధంగా ప్రథమ బహుమతి లభించింది.

-ప్రథమ బహుమతి గ్రహీత, టీఎన్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, మందపల్లి, కొత్తపేట మండలం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

అంతులేని సంతోషం కలిగింది



మొట్టమొదటిసారిగా ఆంధ్రజ్యోతి నుంచి బహుమతి అందుకున్నాం. గతంలో పజిల్స్ పూర్తి చేసి పంపినప్పటికీ బహుమతి రావడం మాత్రం ఇదే. మా అభిమాన పత్రిక ఆంధ్రజ్యోతి నుంచే ఆ బహుమతి అందుకోవడం అంతులేని ఆనందాన్ని, సంతోషాన్ని కలిగించింది. గత పదిహేను సంవత్సరాలుగా మేము ఆంధ్రజ్యోతి పత్రిక చదువుతున్నాం.

-ద్వితీయ బహుమతి గ్రహీత, అడబాల సత్యనారాయణ, శృంగవరప్పాడు, సఖినేటిపల్లి మండలం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

మేము ఆంధ్రజ్యోతి అభిమానులం



మేము ఆంధ్రజ్యోతి పత్రికను ఎంతగానో అభిమానిస్తాం. పత్రిక ఎంతో బాగుంటుంది. గతంలో వేరే పత్రిక చదివే మేము రెండు సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి చందాదారులం అయ్యాం. కార్ అండ్ బైక్ రేస్ కూపన్లు పూర్తి చేసి పంపే సందర్భంలో ఇందులో బహుమతి వస్తే బాగుండునని అనుకున్నాం. అదృష్టం కలిసివచ్చి బహుమతి అందుకున్నాం.

-తృతీయ బహుమతి గ్రహీత, ములస అప్పలరాజు, రామచంద్రపురం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

పుడమితల్లి.. చల్లగా..







- పుడమితో తల్లిలాంటి అనుబంధం
- జీవం, జీవితం అంతా నేలతల్లితోనే
- పరిరక్షించుకోవడం అందరి బాధ్యత
- నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం

(ఆంధ్రజ్యోతి- అమలాపురం రూరల్)

"అమ్మా.. అవనీ.. నేలతల్లీయని ఎన్నిసార్లు పిలిచినా తనివితీరదెందుకని.. కనిపెంచిన ఒడిలోనే కన్నుమూయని.. మళ్లీ నీగుడిలోనే కళ్లు తెరవని.. నీయదపై వాలితేనే మేని పరవశిస్తుంది.. తల్లీ నినుతాకితేనే తనువు పులకరిస్తుందని.." పుడమి తల్లి గొప్పతనాన్ని ఓ సినీ కవి ఎంతో హృద్యంగా రచించారు. పంచ భూతాత్మకమైన జగత్తులో భూమికి ప్రత్యేక స్థానం ఉంది. సకల సంపదలకు నిలయం ధరిత్రి. ప్రాంతాలను బట్టి మట్టి వేర్వేరుగా ఉన్న నేలంతా ఒక్కటే. భూమిపై కనిపించే సంపదలు ఎన్నో ఉన్నా.. అనంతమైన సంపదలను తనలోనే నింపుకుని ఉన్నా ఇసుమంతైనా గర్వపడనిది నేలతల్లి మాత్రమే. సమస్త జగత్తుకు ఓర్పును నేర్పించింది పుడమి తల్లే. సకల జీవరాశులను సమదృష్టితో చూస్తూ మాతృమూర్తులకు ఆదర్శంగా నిలిచింది ఆ అవనే. ఏ జీవికి ఏ మొక్క ఏ రోగానికి ఔషధంగా పనిచేస్తుందో గుర్తించి అందుకు అనుగుణంగా ఎన్నో రకాల వృక్ష జాతులను సమస్త మానవాళికి అందించింది కూడా పుడమితల్లే.

నాశనం వినాశనానికే..

దట్టమైన అడవులను విచ్చలవిడిగా నరికేస్తున్నారు.. సున్నితమైన సముద్రతీర వ్యవస్థలను చేజేతులా నాశనం చేస్తున్నారు.. అవసరాల పేరిట సహజ నిక్షేపాలను అంతూపొంతూ లేకుండా తవ్వుకుంటూ పోతున్నారు. ఈ చర్యల ప్రభావంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతిని ఎక్కడికక్కడ భూకంపాలు.. సునామీలు.. కరువు కాటకాలు వంటి విపత్తులకు మూలహేతువు అవుతోంది. పుడమితల్లి చల్లగా ఉంటేనే సమస్త జీవరాశి సజావుగా మనుగడ సాధించగలదన్నది తిరుగులేని సత్యం. అందుకే ఐక్యరాజ్యసమితి భూమాత పరిరక్షణకోసం ప్రతిఏటా ఏప్రిల్ 22న ధరిత్రి దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహింపజేస్తోంది. భూమికోసం వృక్షసంపద నినాదంతో యూఎన్‌వో పుడమితల్లి పరిరక్షణకు పిలుపునిచ్చింది. వృక్ష సంపద మానవాళికి ఏ రీతిన ఆత్మబంధువుగా వ్యవహరిస్తుందో తెలిసినా.. చెట్లను పరిరక్షించుకోవడంలో వాటి విస్తీర్ణం పెంచడంలో అలవికాని నిర్లక్ష్యం దశాబ్దాల కాలంగా కొనసాగుతూనే ఉంది. ఇది ముమ్మాటికీ వ్యవస్థీకృత లోపమే. నాశనం ఎప్పటికీ వినాశనమే అని మరిచిపోతున్నారు. సమాజాన్ని ముందుండి నడిపే రాజకీయ, పరిపాలనా, వాణిజ్యం వంటి కీలక వ్యవస్థల్లో అత్యాశ, స్వార్థం పెరిగిపోయాయి. ఎవరికివారు తమ సౌఖ్యం కోసం భూగోళంపై ఒత్తిడి పెంచుతున్నారు.

స్వార్థంతో నిస్సారం

సారవంతమైన భూములను.. స్వార్థం కోసం కొందరు..ధనదాహంతో మరికొందరు.. నిస్సారం చేసేస్తున్నారు. నేల విలువను తెలుసుకోలేకపోతున్నారు. ఎందుకంటే కాండ్రించి ఉమ్మేసినా ఆ నేల తల్లి తన కడుపులో దాచేసుకుంటుంది. అందుకేనేమో పచ్చని పంట పొలాలు, కళకళలాడాల్సిన భూములను కళ్లెదుటే ఆక్వా సేద్యం పేరిట చౌడు భూములుగా మార్చేస్తున్నా అటు నాయకులు, ఇటు అధికారులకు పట్టడం లేదు. నేల తల్లి ఒడిలో పచ్చగా పెరగాల్సిన వృక్షాలనే ఇష్టారాజ్యంగా నరుకుతూ పోతున్నారు. అయినా ఆ తల్లి మౌనరోదన వీరెవ్వరికీ కనిపించడంలేదు.. వినిపించడంలేదు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోండి అంటూ ప్రచారం చేస్తారు. అయితే దానిని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు మాత్రం తీసుకోరు. దాంతో నేల తల్లి కడుపున ప్లాస్టిక్ పెద్ద కేన్సర్‌గా మారి భవిష్యత్ తరాలకు ముప్పుతప్పదని హెచ్చరిస్తున్నా పట్టించుకునేవారేరీ. ప్రమాదం జరిగితేనే గానీ స్పందించే పరిస్థితులు కానరావడంలేదు.

సకల సంపదల నిలయం నేలతల్లి..

మట్టిలోనే సకల సంపదలు దాగి ఉన్నాయి. సకల జీవకోటి అవసరాలను తీర్చి ఆహారాన్ని అందిస్తుంది. మళ్లీ అన్ని జీవాలను తనలో కలిపేసుకుంటుంది. అంతటి మహోన్నత శక్తి నేలతల్లికి ఉంది. సృష్టి ధర్మాన్ని అనుసరించి నేల ఒక్కోచోట ఒక్కో విధంగా ఉంటుంది. ఒకచోట ఎర్రరేగడి నేలగా ఉంటే మరోచోట నల్లమట్టిగా, ఇంకోచోట నల్లరేగడి నేలగా, చౌడుభూములుగా, ఎడారిలో ఇసుకగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లోని భూమి తత్వాన్ని బట్టి రకరకాల పంటలు పండుతుంటాయి. ఈ పంటలు ఒక్క మానవజాతికే కాదు సకల జీవరాశుల అవసరాన్ని తీరుస్తాయి.

మట్టిని పిండుకుంటూ పోతే..

విలువైన సంపదలను నింపుకున్న మట్టి నిండు కుండలా ఉంది. అందరి అవసరాలను సమంగా తీరుస్తుంది. కానీ ఆ మట్టిలోని సంపదలను అవసరాలకు మించి పిండుకుంటూపోతే అనర్థాలు తప్పవు. ఇప్పటికే నేల లోపల సమతుల్యత లోపించి ఎన్నో అనర్థాలు సంభవిస్తున్నాయి. భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులకు కొందరు స్వార్థపరుల దోపిడి తత్వమే కారణమని ఇప్పటికే గుర్తించారు. సృష్టిలో సమతుల్యత లోపిస్తే పరిణామాలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల చవిచూశారు.

విశ్వంలో మరోచోట జీవం లేదు..

నేలపై తప్ప విశ్వంలో మరెక్కడా జీవం ఉన్నట్టు ఇప్పటివరకు స్పష్టమైన వైజ్ఞానిక ఆధారాలు లభించలేదు. ఈ భూమిపై ఉన్న జీవంలో ఎంతో వైవిధ్యం దాగి ఉంది. భూమిమీద ఉన్న ఏ జీవ జాతి కనుమరుగైనా ఆహార చక్రానికే విఘాతం ఏర్పడుతుందని జీవవైవిధ్య సదస్సులు గుర్తించాయి. భూవాతావరణంలో వస్తున్న పెనుమార్పుల ప్రభావం నిత్యం మనకు అనుభవంలోకి వస్తూనే ఉన్నాయి. అందుకే అనేక జీవజాతులు.. ఒకే నేల.. ఒకే భవిష్యత్తు.. అంటూ ప్రపంచమంతా జీవవైవిధ్యాన్ని కాపాడాలంటూ పర్యావరణ శాస్త్రవేత్తలు వేడుకొంటున్నారు.

చర్యకు ప్రతిచర్య తప్పదు..

భూమిపై చర్యకు ప్రతిచర్య తప్పదని వైజ్ఞానిక సత్యం. భూమిపై ఉన్న ప్రకృతిని మనిషి నాశనం చేస్తే ఆగ్రహించకుండా ఉంటుందా. మట్టిపై మొలిచిన కన్నబిడ్డల్లాంటి వృక్షాలను నరికేస్తే ఆ తల్లి తల్లడిల్లదా. అందుకే వాతావరణ సమతుల్యత దెబ్బతిని నేడు భూతాపం పెరిగిపోతుందని ప్రపంచ దేశాధినేతలు తలలు పట్టుకుంటున్నారు. అందుకే ఎక్కడ పడితే అక్కడ వాయువు, వరుణుడు కలిసి విజృంభిస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారు. భూమిపై ఉన్న ఒక చెట్టును నేలకూలిస్తే ఒక ఆత్మీయుడిని కోల్పోయినట్టు భావించాలి. వృక్ష నాశనం జరిగినచోట పునః సృష్టికి మనిషి ఉద్యమించి ఆ మట్టి రుణం తీర్చుకోవాలి.

ఇంధన ఉత్పత్తి మూడు రెట్లు పెంచడమే లక్ష్యం కావాలి



ఈ ఏడాది ధరిత్రి దినోత్సవానికి ప్రత్యేక తీరును ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక వనరుల నుంచి ఉత్పత్తి అయ్యే ఇంధన ఉత్పత్తిని మూడు రెట్లు పెంచడమే లక్ష్యంగా నిర్ణయించారు. సౌర, పవన, జల, భూఉష్ణ, అలలు వంటి పునరుత్పాదక శక్తులను వినియోగించి లక్ష్యాన్ని చేరుకోవాలనే నిర్దేశించారు. అయితే ఈ లక్ష్యసాధనకు సమష్టి కృషి ఎంతో అవసరం. తరిగిపోని ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చు. అందుకు ఎన్నో ప్రపంచ దేశాలు ఆదర్శంగా ఉన్న విషయాన్ని గుర్తించాలి.

- డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు

భూతాపంతో జీవరాశి మనుగడకు ముప్పు



వాతావరణ మార్పులతో అకాల వర్షాలు, విపత్తులతో పాటు మితిమీరిన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భూతాపం వల్ల జీవరాశి మనుగడకు ముప్పు ముంచుకొస్తుంది. భూగోళం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రహించాలి. వృక్ష సంపద తరిగిపోతుండటంతో కర్బన ఉద్గారాలు పెరిగి భూతాపం అంచనాలకు మించిపోతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. చెట్లను విరివిగా పెంచడం ద్వారా అనేక జీవజాతులకు ఊపిరిపోయవచ్చు. వృక్ష సంపద జీవావరణాన్ని పరిరక్షిస్తూ మానవాళికి జీవనోపాధిని కలిగిస్తుంది.

- డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం, జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు

జీవరాశి మనుగడ సాగించాలంటే..



దేవుడికి నిరంతరం వీనులవిందైన సంగీతం వినిపించేందుకు భూమి ఎంచుకున్న మార్గమే వృక్షాలని రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పారు. జీవరాశికి ప్రాణవాయువులను అందిస్తున్నాయన్న కృతజ్ఞత కొంచమైనా లేని మనిషి చర్యల వల్ల అడవులు అంతరించిపోతున్నాయి. అభివృద్ధి పేరిట ప్రకృతిని కదలించే రాక్షసక్రీడ ఇలాగే కొనసాగితే మరో రెండు దశాబ్దాల్లో ధరిత్రిపై పచ్చదనమే కరువవుతుందన్న నివేదికలను పాలకులు, ప్రజలు గుర్తించాలి. ప్రతి మనిషి మొక్కను వృక్షంగా పెంచేలా మొక్కవోని దీక్ష తీసుకోవాలి.

- డాక్టర్ మంగళంపల్లి అరుణ్‌కుమార్, అమలాపురం

రైల్వే ప్రాజెక్టును కేంద్రమే పూర్తి చేస్తుంది

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

అమలాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్‌ను కేంద్ర ప్రభుత్వ నిధులతో పూర్తి చేస్తామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖల సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కోర్టులను ఆశ్రయించడం వల్ల రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ పనుల్లో జాప్యం జరుగుతోందని, త్వరలో ఈ సమస్యను పరిష్కరించి పూర్తి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వమద్దతుతో విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలోకి వచ్చిందని, పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా ప్లాంటు పనిచేస్తోందన్నారు. వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అంబేడ్కర్‌కు భారతరత్న ప్రకటించడంతోపాటు పార్లమెంటులో ఆయన చిత్రపటాన్ని పెట్టిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో వైసీపీ, బీజేపీ మధ్య రహస్య ఎజెండా నడుస్తోందని ప్రచారం జరుగుతోందన్న విషయాన్ని విలేకరులు ప్రస్తావించినపుడు... ఆ పార్టీతో మాకు మైత్రి ఏంటంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చక్కగా పని చేస్తోందన్నారు. చంద్రబాబు అడిగే ప్రతి ప్రాజెక్టుకూ ప్రధాని మోదీ గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. మే 2న ప్రధాని అమరావతి వచ్చి ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తారన్నారు. విలేకరుల సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ యాళ్ల దొరబాబు పాల్గొన్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వే ప్రాజెక్టు పూర్తికి సహకరిస్తామని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ చేసిన వ్యాఖ్యలను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి స్వాగతించారు. కోనసీమవాసుల కల సాకారం దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయన్నారు. నాడు తన తండ్రి బాలయోగి అంకురార్పణచేసిన ఈ ప్రాజెక్టు ఆయన మరణానంతరం మరుగున పడిపోయిందన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ముందుకు సాగిందన్నారు.



కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మతో ఎంపీ హరీష్



మేఘనను అభినందిస్తున్న ఎంఎస్ఎన్ చార్టీస్ ఈవో విజయలక్ష్మి

ఫుట్‌బాల్ జాతీయ టోర్నీకి మేఘన ఎంపిక

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంఎస్ఎన్ చార్టీస్ హైస్కూలు 8వ తరగతి విద్యార్థిని టి.మేఘన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కి ఎంపికైంది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 25 నుంచి 29 వరకు జరగబోయే టోర్నీలో పాల్గొనేందుకు వెళ్తున్న మేఘనను ఎంఎస్ఎన్ చార్టీస్ ఈవో, సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి సోమవారం అభినందించారు. జాతీయ టోర్నీకి తమ విద్యార్థిని ఎంపికవ్వడం గర్వకారణంగా ఉందని, అక్కడ రాణించి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎంఎస్ సుబ్రహ్మణ్యం, పీఈటీ గోవింద్ పాల్గొన్నారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యాసంవత్సరానికిగాను ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న(అనాథ,హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు వారి నివాసానికి సమీపంలో ఉన్న ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25శాతం కోటా క్రింద ప్రవేశం పొందవచ్చన్నారు. ఆసక్తి గలవారు cse.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా సమీపంలోని గ్రామ సచివాలయం, ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 1800 4258 599 టోల్‌ఫ్రీ నెంబరును సంప్రదించవచ్చన్నారు.


నేడు 'నన్నయ' ఆవిర్భావ దినోత్సవం



దివాన్‌చెరువు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆవిర్భవించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మంగళవారం 19వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటోందని ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం త్రీటీ ఫౌండేషన్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. విశ్వవిద్యాలయంలోని కన్వెన్షన్ సెంటర్లో మధ్యాహ్నం జరిగే వేడుకలకు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనరు ఎం.మోహన్‌బాబు హాజరవుతారని తెలిపారు. యూనివర్శిటీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా సిబ్బందికి నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని, దీంతో పాటు ధరిత్రి దినోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

ఏపీఈఏపీసెట్‌కు 3,37,437 దరఖాస్తులు

- ఇంజనీరింగ్‌కు 2,63,708, అగ్రికల్చర్ ఫార్మసీకి 72,966, రెండింటికీ 763
- 24 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు
- మే 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షలు
- కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు



జేఎన్టీయూకే, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్-2025కు ఇప్పటివరకు 3,37,437 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,63,708 మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 72,966 మంది, రెండింటికీ 763 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, మే 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏపీలో 46, తెలంగాణలోని హైదరాబాద్‌లో 2 కేంద్రాల్లో పరీక్షలు జరుపుతామన్నారు. మే 19 నుంచి 20 వరకు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్లలో, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మే 21నుంచి 27 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మే 24న పరీక్ష ఒక సెషన్‌లో మాత్రమే ఉంటుందని 25న పరీక్ష ఉండదన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం దరఖాస్తుల సంఖ్య బాగా పెరిగే అవకాశముందన్నారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికి 0884-2359599, 2342499 నెంబర్లను సంప్రదించాలని కన్వీనర్ సుబ్బారావు సూచించారు.

25న కంచి యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కంచి చంద్రశేఖర సరస్వతి విశ్వ మహా విద్యాలయం (కంచి యూనివర్సిటీ)లో చేరేందుకు ఈ నెల 25న రాజమహేంద్రవరంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో విద్యార్థులకు సమగ్ర అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, అదే రోజు స్పాట్ అడ్మిషన్లు కూడా జరుగుతాయని ఆంధ్రకేసరి యువజన సమితి తెలిపింది. సమరయోధుల పార్కు భవనంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో సమితి ప్రతినిధులు మాట్లాడుతూ సదస్సుకు కంచి యూనివర్సిటీ ఉప కులపతి గుళ్లపల్లి శ్రీనివాస్ విచ్చేస్తున్నారని... బీఈ, ఎంబీఏ, బీఈ ఆనర్స్‌కు సంబంధించిన 45 రకాల కోర్సుల గురించి వివరిస్తారన్నారు. సమావేశంలో సమితి కన్వీనర్లు మాదిరాజు శ్రీనివాస్, దేశిరెడ్డి బలరామనాయుడు, దూర్వాసుల సత్యనారాయణ, షట్రేవు ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అమ్మో...ంబులెన్స్!

కాకినాడ జిల్లా పెద్దాపురం సీహెచ్‌సీలో సోమవారం 108 అంబులెన్స్ మొరాయించింది. నిద్రమాత్రలు మింగిన బాధితులను అత్యవసర చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించేందుకు అంబులెన్స్‌లోకి ఎక్కించారు. అయితే ఎంతసేపటికి వాహనం స్టార్ట్ కాలేదు. దీంతో స్థానికులతో కలిసి వాహనాన్ని ముందుకు తోసి స్టార్ట్ చేయడానికి సిబ్బంది ప్రయత్నించారు. ఎంతసేప టికీ స్టార్ట్ కాకపోవడంతో అమ్మో అనుకుంటూ ప్రైవేటు వాహనంలోవారిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి)

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

కొవ్వూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరులంకలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. మద్దూరులంకకు చెందిన చిత్రాపు వెంకట్రావు (45) భార్య 9 నెలల గర్భిణి 6 నెలల క్రితం గుండె పోటుతో మృతిచెందింది. లారీ ఈఎమ్ఐ చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు లారీని సీజ్ చేసి తీసుకువెళ్లిపోయారు. దీంతో నెలరోజులుగా వెంకట్రావు గ్రామంలో కనిపించడం లేదు. సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఆకుల కృష్ణారావుకు చెందిన పల్లిపాలెంలో ఉన్న మకాం దగ్గర్లో గుర్తుతెలియని మృతదేహం ఉందని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం వద్ద ఉన్న చెప్పులు, మొబైల్‌ఫోన్ ఆధారంగా వెంకట్రావుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

40 మాత్రలు మింగి...

అనారోగ్యం తాళలేక మహిళ ఆత్మహత్య

కొవ్వూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం తాళలేక ఆత్మహత్య చేసుకుని మహిళ మృతిచెందినట్టు పట్టణ సీఐ వి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు గణేష్‌కాలనీకి చెందిన ఆకాశపు అరుణ తల్లి ముప్పన వరలక్ష్మి(52) బీ.పీ, షుగర్, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతూ ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో వైద్యం పొందుతుంది. ఈ నెల 20న కుమార్తె కూలిపనికి వెళ్లిన సమయంలో అనారోగ్య సమస్యలు తాళలేక వరలక్ష్మి తాను వాడే 40 మాత్రలు ఒకేసారి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి 7గంటలకు వచ్చిన కుమార్తె తల్లిని చూసి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆసుపత్రి సమాచారం మేరకు అరుణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

తుని రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణంలోని ఉప్పరగూడెం సమీపంలో పోలీసులు గంజాయితో నలుగురిని అరెస్ట్ చేశారు. 5 కిలోల గంజాయిని స్వాధీన పరుచుకున్నారు. తునికి చెందిన పడగం శివసంతోష్, పిట్టా నాగ సత్యమహేష్, మనసాని వెంకటేష్, షేక్ ఉమా గౌరీలను అరెస్ట్ చేసినట్టు సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. శివ సంతోష్ గంజాయిని ఏజెన్సీ ప్రాంతాల్లో కొనుగోలు చేసి మిగతా ముగ్గురితో కలిసి తునిలో అమ్మకాలు చేపడుతున్నట్టు గుర్తించామన్నారు. నలుగురు నిందితులను మంగళవారం హాజరపరచనున్నట్టు చెప్పారు.



వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక..

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కుటుంబం ఆత్మహత్యాయత్నం

పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలింపు

పెద్దాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మున్సిపల్ రెండో వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, ఆమె భర్త సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుమారుడు శ్రీకాంత్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వారు ఈ ఘటనకు పాల్పడినట్టు తెలుస్తోంది. వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక సూసైడ్‌నోట్ రాసి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. పరిస్థితిని గమనించిన ఇంట్లో పనివారు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి వైద్యం అందించారు. దంపతుల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మహాలక్ష్మి కుటుంబం గతేడాది జూన్‌లో వైసీపీకి రాజీనామా చేసింది. ఆ తర్వాత ఏ పార్టీలోనూ చేరలేదు.



ఆసుపత్రిలో వైస్ చైర్మన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

మహాలక్ష్మి ప్రస్తుతం పెద్దాపురం మున్సిపల్ రెండో వైస్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతుండగా ఆమె భర్త సుబ్రహ్మణ్యేశ్వరావు, కుమారుడు శ్రీకాంత్ పట్టణంలో మండపేట స్వీట్‌మార్ట్ పేరుతో వ్యాపారం చేస్తున్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు ఆసుపత్రికి వెళ్లి మహాలక్ష్మి కుటుంబీకులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి



లంక సిద్ధార్థ మౌర్య (ఫైల్‌ఫొటో)

యానాం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యానాం బెజవాడ గార్డెన్స్‌కు చెందిన లంక సిద్ధార్థ మౌర్య (18) సోమవారం ఉదయం ట్యూబ్‌లైట్ వైరు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు వైర్ తగిలి మృతిచెందాడు. ఇంటినిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి తండ్రి లంక చిన్నలోవ రాజు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేసి ఇటీవల పదవీ విరమణ పొందారు. తల్లి యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. మౌర్య ఇటీవల కాకినాడ ఆదిత్య కళాశాలలో ఇంటర్ సెకండియర్ పూర్తి చేశాడు. అతడి అంత్యక్రియల్లో పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు.

కాకినాడలో వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం




వృద్ధురాలితో మాట్లాడుతుఉన్న ఏఎస్ఐ

కాపాడిన ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకోవాలని భావించగా మహిళా ఏఎస్ఐ రక్షించారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం రామేశ్వరానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు సోమవారం కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జిపైకి వచ్చింది. ఉప్పుటేరులోకి దూకేందుకు ప్రయత్నిస్తూండగా మహిళా ఏఎస్ఐ బి.కుమారిబేబీ, కానిస్టేబుళ్లు సీహెచ్ రఘు, ఎస్.ఫణికృష్ణ సహాయంతో రక్షించారు. విచారించగా అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్టు ఆ మహిళ చెప్పిందని ఏఎస్ఐ వివరించారు. కౌన్సిలింగ్ ఇచ్చి వన్‌టౌన్ లా అండ్‌ఆర్డర్ పోలీసుల ద్వారా కుటుంబ సభ్యులకు అప్పగించామని చెప్పారు.

దొరకని ఆచూకీ

సీలేరు నదిలో గల్లంతైన యువకుల కోసం రెండో రోజూ గాలింపు



సీలేరు నదిలో డ్రోన్‌తో గాలింపు చేపట్టిన పోలీసులు

చింతూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విహార యాత్రకు వెళ్లిన ఇద్దరు యువకులు ఆదివారం సీలేరు నదిలో గల్లంతైన విషయం విదితమే. గల్లంతైన సుగ్రీవ శ్రీను, నాగుల దిలీప్‌ల ఆచూకీ కోసం కల్లేరు వద్ద సీలేరు నదిలో సోమవారం కూడా గాలించారు. ఈ మేరకు చింతూరు పోలీసులు ఎన్‌డీఆర్‌ఎఫ్ సేవలను తీసుకున్నారు. డ్రోన్‌ని కూడా వినియోగించారు. కాగా రాత్రి వరకు ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. యువకులు గల్లంతైన ప్రదేశంలో నది లోతు ఎక్కువగా ఉండడంతో పాటు పెద్ద బండలు ఉంటాయని, వాటి నడుమ చిక్కుకుని ఉండి ఉండవచ్చన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి. గాలింపు చర్యలను చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, ఎస్ఐ పి.రమేష్ పర్యవేక్షించారు.

నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాల వినియోగం

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ



పోలీసులకు డ్రోన్లపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నామని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. డ్రోన్ కెమెరాల వినియోగంపై పోలీస్ సిబ్బందికి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక శిక్షణ నిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణే లక్ష్యంగా సున్నిత ప్రాంతాలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలపై డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా పెడుతున్నామన్నారు. బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి వాడడం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, దొంగతనాలు తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడిపై దృష్టి సారించామన్నారు. డ్రోన్ కెమెరాల వాడకంపై సిబ్బందికి శిక్షణఇస్తున్నామని ఎస్పీ చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి జైలు శిక్ష

కాకినాడ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 18మంది వాహన చోదకులకు మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్-1,-2 పరిధిలో పోలీసులు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. 26 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్టు గుర్తించి కాకినాడ మూడో అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. 18 మందికి జైలు శిక్ష విధిస్తూ జడ్జి డి.శ్రీదేవి తీర్పునిచ్చారు. ఇందులో ముగ్గురికి ఒక్కొక్కరికి ఐదు రోజులు జైలు శిక్ష, 15 మందికి తలో రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మిగతా 8 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు కాకినాడ ట్రాఫిక్ సీఐలు రమేష్, రామారావు తెలిపారు.

ఇంటర్ అడ్వాన్సు సప్లిమెంటరీ రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌ల.. ఫీజు చెల్లింపునకు నేటితో ఆఖరు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2025లో ఉత్తీర్ణత సాధించిన వాళ్ల అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు, రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌లకు ఫీజు చెల్లించడానికి మంగళవారం చివరి తేదీ అని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు ఎన్ఎస్‌వీఎల్ నరసింహం పేర్కొన్నారు. ఫీజు ఇంకా చెల్లించని విద్యార్థులు సాయంత్రం 4గంటల్లోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. ఫీజు చెల్లింపు గడువు పొడిగించకపోవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు, అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ చొరవ చూపాలన్నారు.

అజెండాకు ఆమోదం

అన్నవరం దేవస్థానంలో పలు అభివృద్ధి పనులపై పాలకమండలి సమావేశం

అన్నవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో సోమవారం చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు, వివిధ విభాగాల అధికారులు ప్రవేశపెట్టిన అజెండాను చైర్మన్ రోహిత్ ఆమోదించారు. ప్రధానంగా భక్తులు హుండీల్లో సమర్పించిన చీరలు, పంచెలు ఇతర వస్త్రాలు హుండీ లెక్కింపురోజున బహిరంగవేలం నిర్వహించాలని ప్రవేశపెట్టిన అజెండాకు ఆమోదం లభించింది. రౌతులపూడి మండలం గొంది గ్రామంలో ఉన్న మెరకభూమిలో యూకలిప్టస్, సురుగుడు, సుబాబుల్ మొక్కలను స్వయంగా దేవస్థానం పెంచేందుకు ఆమోదించారు. స్మార్తఆగమ పాఠశాలలో దాత సహాయంతో జీఐ ప్రొఫైల్ షెడ్డు ఏర్పాటుకు చైర్మన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కొండదిగువున నూతనంగా నిర్మించతలపెట్టిన రథశాల నుంచి మెయిన్‌రోడ్డుకు 38 అడుగుల అప్రోచ్‌రోడ్డు, రథశాలకు పిల్లర్లు, తదితర పనులకు పిలిచిన టెండర్లలో లోయెస్ట్‌టెండర్ ఆమోదించారు. సమావేశంలో సహాయకమిషనర్ రామ్మోహనరావు, ఏఈవోలు కొండలరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

కల్యాణోత్సవ ఏర్పాట్లపై రేపు సమీక్ష

మే 7నుంచి ప్రారంభంకానున్న స్వామివారి వార్షిక కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఈనెల 23న పెద్దాపురం డీఎస్పీ, ఆర్డీవో అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులకు లక్ష్యాలను నిర్దేశించనున్నారు.

అన్నవరం దేవస్థానంలో వివాదాలపై నేడు అదనపు కమిషనర్ విచారణ

అన్నవరం దేవస్థానంలో ఇటీవల జరుగుతున్న వివాదాలపై దేవదాయకమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలతో అదనపు కమిషనర్ చంద్రకుమార్ మంగళవారం ఉద్యోగులు, ఇతరులను కలిసి ఒక నివేదకను తయారు చేయనున్నారు. దీనిని దేవదాయ కమిషనర్‌కు సమర్పిస్తారు. సోమవారం రాత్రికి అన్నవరం చేరుకున్న ఆయన అతిథిగృహంలో బస చేసి మంగళవారం వివాదాలపై ఆరా తీయనున్నారు. ప్రధానంగా ఈవో కుమారుడు పాలనాపరమైన వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటుండడం, ఇద్దరు ఉద్యోగులు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేయడానికి ఒకరు బదిలీపై వెళ్లిపోవడం, మరికొందరు సెలవుపెట్టి వెళ్లడం, మరికొందరు సెలవుకు దరఖాస్తు చేయడానికి ప్రధాన కారణమేమిటి అనేదానిపై విచారణ చేయనున్నట్టు సమాచారం. అయితే ఈవో సిబ్బందిని సమన్వయం చేసుకోలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గంటల తరబడి సమీక్షలు, ఆ సమీక్షల సమయంలో సహచర ఉద్యోగులు ఉన్నా దురుసుగా మాట్లాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల ఒక సూపరెంటెండెంట్‌ను ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేసిన తరువాత ఈవో వ్యవహార శైలిలో మార్పు కనిపించినట్టు పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

గాలి వాన బీభత్సం

కుప్పకూలిన మామిడి చెట్లు

పడిపోయిన ఇళ్లు



మోతుగూడెంలో ఇంటిపై కూలిన చెట్టు



పొల్లూరులో ఇంటిపై పడిన భారీ వృక్షం

మోతుగూడెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. దీంతో బెంగాలీక్యాంపులో ఉషా సింగ్ అనే మత్స్యకారిణి ఇంటిపక్కనే ఉన్న పెద్దమామిడి చెట్టు ఇంటిపై కప్పుపై పడి భవనం కూలిపోయింది. ఇల్లు పడిపోవడంతో తాను ఎక్కడ నివసించాలని బాధితురాలు బోరున విలపిస్తోంది. తన కొడుకు, కోడలతో ఇంటిలో నివాసం ఉంటున్నామని, చేపలు పడితే కానీ కుటుంబం గడవదని ఆవేదన చెందుతోంది. పొల్లూరు గ్రామంలో జెన్‌కో క్వార్టర్‌లో గోవింద్ రాజు ఇంటిపై మామిడి చెట్టు పడిపోయింది. శబ్దానికి ఇంట్లో ఉన్న వారు బయటకుపరుగులు తీశారు. ప్రాణపాయం తృటిలో తప్పినా ఇల్లు పడిపోవడంతో ఎక్కడ నివసించాలని ఆవేదన చెందుతున్నారు.

మల్లాం సమస్యను శాంతియుతంగా పరిష్కరించాం

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

పిఠాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాం గ్రామంలో సాంఘిక బహిష్కరణ అంశాన్ని శాంతియుతంగా పరిష్కరించామని కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ తెలిపారు. ఈ సమస్యకు సంబంధించిన పూర్వపరాలను పరిశీలించి సాంకేతికంగా పరిష్కరించే నిమిత్తం కాకినాడ ఆర్డీవో, పిఠాపురం తహశీల్దార్, సీఐ, ఏఎస్‌డబ్ల్యూవో ఆధ్వర్యంలో ఇరువర్గాలతో శాంతి కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక వర్గం నుంచి దుర్గాడ సత్తిబాబు, కాలదారి రాంబాబు, ఎద్దు సుబ్రహ్మణ్యం, అంగులూరి నూకరాజు, కడితి కృష్ణారావు, దాట్ల సూరిబాబు... మరోవర్గం నుంచి కుంపట్ల చెల్లారావు, మలిరెడ్డి రామచంద్రరావు, రంగనాథం అప్పన్న, కొప్పన వీర్రాజు, కొండపల్లి కొండారావు, బుర్రా వీరేష్‌బాబు శాంతి కమిటీ సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఒక వర్గంపై విధించిన సాంఘిక బహిష్కరణను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఇటువంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని సమావేశంలో నిర్ణయం తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇరువర్గాల్లో ఎవరైనా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం, ప్రకటనలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తీర్మానించారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఏమైనా వివాదాలు జరిగితే కలిసి కూర్చుని పరిష్కరించుకోవాలని సభ్యులు అంగీకారానికివచ్చారని కలెక్టర్ చెప్పారు.

విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు

మల్లాం గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన సంఘటనలకు సంబంధించి వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాలతో సోమవారం రాత్రి మల్లాం గ్రామ సచివాలయంలో ఇరువర్గాలకు చెందిన శాంతికమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా శాంతికమిటీ సభ్యులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామని తెలిపారు. యువతకు విద్య, ఉద్యోగావకాశాలు, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతపై ఇకపై ప్రతి ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు. శాంతికమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రూరల్ ఎస్ఐ జానీబాషా పాల్గొన్నారు.



మల్లాంలో జరిగిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వికాస పీడీ లచ్చారావు

గ్రామపెద్దలే బహిష్కరించారు

కాకినాడ కలెక్టర్‌కు ఓ కుటుంబం ఫిర్యాదు

కాకినాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మాధవరాయుని పేటలో ఉంటున్న తమను తమ సొంత సామాజికవర్గానికి చెందిన ఊరి పెద్దలే గ్రామ బహిష్కరణ చేశారంటూ గంజా మహాలక్ష్మి చంటి కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం చంటి మీడియాతో మాట్లాడారు. 2024 అక్టోబర్ 15న కాలనీలో నివాసం ఉండే కుడుపూడి మల్లేశ్వరరావు తన భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో అతడిని ప్రశ్నించగా తనను కొట్టారని, అప్పట్లో కోరంగి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశానన్నారు. దీంతో పోలీసులు మల్లేశ్వరరావు, తనను స్టేషన్‌కు పిలిచి కుల పెద్దల సమక్షంలో రాజీ చేసుకోవాలని సూచించారన్నారు. దీనిపై తమ గ్రామానికి చెందిన శెట్టిబలిజ కుల పెద్దలను అక్టోబర్ 17వ న కలవగా.. వారిలో మల్లేశ్వరరావు బంధువులు కూడా ఉన్నారన్నారు. వారందరూ తనదే తప్పు అన్నట్టుగా రూ.6 వేలు తీసుకోవడమే కాకుండా తనతో, తన భార్యతో తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకున్నారన్నారు. అంతేకాకుండా కొన్ని రోజుల తర్వాత రూ.80 వేలు ఇవ్వాలని కుల పెద్దలు డిమాండ్ చేశారని, అంత సొమ్ములు ఇచ్చుకునే స్థోమత తనకు లేదనివారికి చెప్పడంతో గ్రామ బహిష్కరణ చేశారన్నారు. గ్రామంలోని వారెవరూ తమతో మాట్లాడకుండా చేశారని, తమ ఇంటి శుభకార్యాలకు ఎవరూ రాకుండా, తాము ఎవరి ఇంటికి వెళ్లకుండా తీర్పు చెప్పారన్నారు. ఈ విషయమై 2024 డిసెంబర్ 23న జిల్లా ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అయినా తమకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. గ్రామ బహిష్కరణకు కారణమైన కులపెద్దలు నాగరాజు, పితాని శ్రీను, గుత్తుల శ్రీను, పిల్లి కొండ, పెంకే నాగేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కలెక్టరేట్‌కు వచ్చిన బాధిత కుటుంబం

మే 10న జాతీయ లోక్ అదాలత్

అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలి : పీడీజే సునీత



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మే 10న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు బ్యాంకులు, విద్యుత్తు, టెలిఫోన్ శాఖల ప్రతినిధులతో డీఎల్ఎస్ఏ ఇంచార్జి కార్యదర్శి బి.పద్మ, పీడీజే సోమవారం సమావేశం నిర్వహించారు. బాధితులకు తగు పరిహారం అందించడంపై కూడా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన అన్ని కేసులను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలుతీసుకోవాలని ఆమె సూచించారు.

ఏలేరులో..

నీటి నిల్వలు తగ్గుముఖం

ఏలేశ్వరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత పెరగడంతో కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహం తగ్గడంతో ఆయకట్టుకు నీటి సరఫరా తగ్గించారు. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా సోమవారం 76.91 మీటర్లుగా నమోదైంది. పూర్తిస్థాయి నిల్వల సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 10.26 టీఎంసీల మేర మాత్రమే నీటి నిల్వలున్నాయి. ప్రస్తుతం ఆయకట్టుకు 400, విశాఖకు 228 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రమాదాలు తప్పించిన ఇద్దరు రైల్వే ఉద్యోగులకు అవార్డులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ 'ఎంప్లాయిస్ ఆఫ్ ది మంత్ మార్చి-2025' సేఫ్టీ అవార్డును సాధించారు. ఈ మేరకు పాయింట్స్‌మెన్ కె.నెతానియెల్, ట్రైన్ మేనేజర్ లోకేశ్ కుమార్‌కి సోమవారం జీఎం అరుణ్ కుమార్ జైన్ అవార్డులను ప్రదానం చేశారు. ఆపరేటింగ్ విభాగంలో విధుల్లో ఉన్న నెతానియెల్.. గూడ్స్ రైలులోని ఓ బోగీ కింద మంటలు వస్తున్నట్టు గమనించారు. స్టేషన్ మేనేజర్‌కి సమాచారం ఇచ్చి అందుబాటులో ఉన్న ఫైర్ ఎక్స్‌టింగిషర్‌తో మంటలను ఆర్పారు. రాజమండ్రి కేంద్రంగా పనిచేస్తున్న లోకేశ్ కుమార్ తాను విధుల్లో ఉన్న రైలుకు దెందులూరు సమీపంలో ఓ బోగీ కింద పొగలు రావడం గమనించి లోకో పైలట్‌ని అప్రమత్తం చేసి రైలును ఆపారు. పరీక్షించిన సంబంధిత విభాగ సిబ్బంది హాట్ యాక్సిల్ కాగలదని చెప్పారు. ఆయా బోగీలను తప్పించి రైలును ప్రమాదాల నుంచి తప్పించిన వారికి జీఎం అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా వారికి రాజమహేంద్రవరం ఎస్ఎంఆర్ తదితరులు అభినందనలు తెలిపారు.

వాటర్‌ట్యాంకు నిర్మాణానికి స్థలం కేటాయించండి

పి.గన్నవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): లంకల గన్నవరంలో తాగునీటి కోసం ట్యాంక్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎంపీపీ గనిశెట్టి నాగ లక్ష్మి డిమాండ్ చేశారు.సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. రూ.40లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఇరిగేషన్ స్థలం గుర్తించామన్నారు. అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు.

దేవతామూర్తుల గ్రామోత్సవం

మలికిపురం,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):మలికిపురం ఎత్తు వంతెన వద్ద నూతనంగా నిర్మించిన హరిహరసుత అయ్యప్పస్వామిఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం దేవతామూర్తులగ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో స్వామి-అమ్మవార్ల విగ్రహాలను ఊరేగించారు.

చెత్త సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ఆందోళన

యానాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): యానాంలో చెత్త సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ యానాం శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ యానాం శాఖ అధ్యక్షుడు అర్ధాని దినేష్, కాంటంశెట్టి రామ్మూర్తి ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, అభిమానులు రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లతో లోడ్ చేసుకుని ఆర్‌ఏ కార్యాలయానికి బయలుదేరారు. ఆర్‌ఏ కార్యాలయ సమీపంలోని ఇందిరాగాంధీ సర్కిల్ వద్ద నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే కాంగ్రెస్ నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. లోపలికి చెత్త ట్రాక్టర్లను అనుమతించకపోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు ఇక్కడ నుంచి వెళ్లేది లేదని తేల్చిచెప్పారు. యానాం ఎమ్మెల్యే అనాలోచి నిర్ణయంతో ఈసమస్య ఏర్పడిందన్నారు. మూడు నెలలుగా యానాంలో చెత్త సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే పుదుచ్చేరి కాంగ్రెస్ ఎంపీ వైద్యలింగం, మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామిని యానాం ఆహ్వానించి, వారితో ఆందోళన చేపడతామన్నారు. అలాగే ఆర్‌ఏ, మున్సిపల్ కార్యాలయాల వద్ద ప్రజలతో చెత్త వేసేలా చేస్తామని హెచ్చరించారు. ఆందోళనకారులతో పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. త్వరలో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలపడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళన విరమించారు. అన్నాడీఎంకే యానాం శాఖ కార్యదర్శి మంచాల సత్యసాయి కుమార్, నల్ల వెంకన్న, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే సృజనాత్మక విద్యాబోధన

బడిబాట ప్రారంభించిన ఆర్జేడీ నాగమణి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే సృజనాత్మక విద్యాబోధన జరుగుతుందని రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి స్వేచ్ఛాయుతంగా గుణాత్మక విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆమె కోరారు. అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి సోమవారం బడిబాట కార్యక్రమాన్ని ఆర్జేడీ జెండా ఊపి ప్రారంభించారు. ఏపీటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. జిల్లా విద్యా



అమలాపురంలో డీఈవో షేక్ సలీంబాషాతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్జేడీ నాగమణి

శాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, నీతివంతమైన విద్యాబోధన జరుగుతుందన్నారు. గ్రామాల్లోఉన్న ప్రభుత్వ పాఠశాలలను తక్కువగా చూడవద్దని క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించేందుకు నిరంతరం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావు మాట్లాడుతూ అల్లవరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో వరుసగా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు, అల్లవరం మండల విద్యాశాఖాధికారి కె.కిరణ్‌బాబు, ఎస్.ఏడుకొండలు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.నాగభూషణం, ఎన్.శ్రీనివాస్, వి.రాజశేఖర్, ఎం.సత్యనారాయణ, గుత్తాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ నిధుల అవకతవకలపై డీవైఈవో విచారణ



అంబాజీపేట హైస్కూల్‌లో విచారణ చేపడుతున్న డీవైఈవో

అంబాజీపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) ద్వారా రూ.18.70లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈనిధులతో పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్, ర్యాంపు, గ్రౌండ్ తదితర పనులు చేపట్టారు. విద్యార్థులతో పనులు చేయించి హెచ్ఎం కడలి సాయిరామ్ బిల్లులు పెట్టారని, మధ్యాహ్నభోజన పథకం ద్వారా వచ్చే గుడ్లు, కూరగాయలు పక్కదారి పడుతున్నాయని, ఉపాధ్యాయుల ఎస్ఆర్, ఇంక్రిమెంట్లకు ఉపాధ్యాయుల నుంచి హెచ్ఎం సాయిరామ్ డబ్బులు వసూళ్లు చేస్తున్నారని పాఠశాలలో పనిచేస్తోన్న ఓ ఉపాధ్యాయుడు ఫొటో ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఈవో ఆదేశాలతో కొత్తపేట ఉపవిద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి అంబాజీపేట హైస్కూల్‌లో సోమవారం విచారణ నిర్వహించారు. హైస్కూల్‌లో పనిచేస్తోన్న ప్రతీ ఉపాధ్యాయుడు, పనులు చేసిన విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పీఎం శ్రీ ద్వారా చేపట్టిన పనులను, రికార్డులను ఆయన పరిశీలించారు. నివేదికను డీఈవోకు అందిసామని డీవైఈవో విలేకరులకు తెలిపారు.

వేట్లపాలెం స్కూల్ వార్షికోత్సవం

కాట్రేనికోన, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వేట్లపాలెం ఎంపీయూపీ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఒకటవ తరగతిలో చేరిన 12మంది విద్యార్థులకు ఎంఈవోలు ఎస్వీ లక్ష్మీనారాయణ, ఎం.వెంకటరమణ పలకలు, బలపాలు పంపిణీ చేశారు. ఎంపీయూపీ స్కూలు మోడల్ ప్రైమరీ అండ్ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయినట్టు అధికారులు ప్రకటించారు.

తాగునీటి కోసం నిరసన

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ముమ్మిడివరం మండలం అనాతవరం పంచాయతీ పరిధిలోని బాలయోగి కాలనీ, పెయ్యలవారిపేట ప్రాంత మహిళలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. తాగునీటిని సరఫరా చేసే పైపులైనును పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించారు. దాంతో మా ప్రాంతానికి తాగునీరు అందడం లేదు. కొత్తగా పైపులైను వేసి తాగునీటిని సరఫరా చేయాలని ఆయాకాలనీలమహిళలు నిరసన తెలిపి కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

హైవే పనులకు అడ్డంకులు తొలగించండి

మలికిపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): హైవే పనులకు అడ్డంకులు తొలగించాలని కేంద్ర భారీ పరిశ్రమల బొగ్గుగనుల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను బీజేపీ నాయకులు కోరారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని దిండిలో వారు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, యేడిద వంశీ, కుంచే పెద్దబ్బులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ఐ.పోలవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జి.మూలపొలంలో గ్రామ సర్పంచ్ మందపాటి విజయలక్ష్మిభైరవస్వామి అధ్యక్షతన సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కానుకలు, పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెమ్మాడి మల్లికార్జునరావు, సంగాని వీరబాబు, పోతాబత్తుల చిన్న, ఉంద్రు గంగాద్రి, స్కూల్ హెచ్ఎం జనార్ధనరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్‌లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు

అమలాపురం రూరల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష రాష్ట్ర ఎస్పీడీ ఆదేశాల మేరకు ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. సీట్ల కేటాయింపులో భాగంగా జిల్లాలోని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు సీఎస్ఈ వెబ్‌సైట్‌లో వెంటనే రిజిష్టర్ కావాలన్నారు. ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు అధ్యక్షతన సోమవారం సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఆయా పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించినసమావేశంలో డీఈవో మాట్లాడారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోని పాఠశాలలపై రాష్ట్ర ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమిస్తారని హెచ్చరించారు. గడువులోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు12(1)సీ నోటిఫికేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండల



ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

విద్యాశాఖ కార్యాలయాల్లో పేద విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్కుల సహకారం తీసుకోవాలని రమేష్‌బాబు సూచించారు. అమలాపురం, రామచంద్రపురం ఉపవిద్యాశాఖాధికారులు గుబ్బల సూర్యప్రకాశం, పి.రామలక్ష్మణమూర్తి, డీఈవో కార్యాలయ ఏడీ నక్కా సురేష్, సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బీర హనుమంతరావు, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 30అర్జీలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 30 అర్జీలను ఎస్పీ కృష్ణారావు నేరుగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే క్షేత్ర స్థాయి అధికారులకు సమాచారం అందించి చట్టపరిధిలో పరిష్కారాలకు ఆదేశాలు జారీ చేశారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

అంబాజీపేట,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): లక్ష్యసాధనకు విద్యార్థులు కృషిచేయాలని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. స్థానిక జడ్పీహైస్కూల్‌లో ఒకేషనల్ కోర్సులో భాగంగా 12 రోజులు నిర్వహించిన ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులకు శిక్షణ సర్టిఫికెట్లను అందించారు. డీవైఈవో లక్ష్మణమూర్తి, భీమారావు పాల్గొన్నారు.

అమలాపురం-ఎస్.యానాం రోడ్డును విస్తరించండి



చల్లపల్లిలో రహదారి నిర్మాణానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం-ఎస్.యానాం ఆర్ అండ్‌బీ రహదారిని 40అడుగుల వెడల్పుతో విస్తరించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఓఎన్జీసీ, వేదాంత సంస్థలను కోరారు. చల్లపల్లి గ్రామంలో కోటి రూపాయల ఓఎన్జీసీ నిధులతో ఆధునికీకరించనున్న ఆర్అండ్‌బీ రహదారి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చల్లపల్లి- ఎస్.యానాం రహదారిని పటిష్ఠంచేసి గతంలో మాదిరిగానే కొనసాగించాలన్నారు. కాగా జగ్గరాజుపేట ఓఎన్జీసీ సైట్ యాజమాన్యం చల్లపల్లి గ్రామాన్ని దత్తత తీసుకోవాలన్న ప్రజల డిమాండ్‌కు ఆయన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, గొలకోటి చిన్నా, బూసి బుజ్జిదొర, దంగేటి బాబులు, పోలిశెట్టి శివాజీ, దంగేటి రవీంద్రనాద్, సుంకర రాంబాబు, కుంపట్ల రమేష్, పోలిశెట్టి ఉమ, సుంకర చిన్నబ్బాయి పాల్గొన్నారు.

ఓఎన్జీసీ నుంచి శిస్తు ఇప్పించండి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మామిడికుదురు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ వారు తమ కార్యకలాపాల కోసం రైతుల నుంచి లీజుకు తీసుకున్న భూములకు శిస్తు చెల్లించే విధంగా చూడాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవికి కరవాకకు చెందిన రైతులు సోమవారం వినతిపత్రం అందించారు. కరవాక గ్రామంలో వివిధ సర్వే నంబర్లలో 6.05ఎకరాల వ్యవసాయ భూమిని ఓఎన్జీసీ అధికారులు 2009-10లో లీజుకు తీసుకున్నారని, 2022 నుంచి ఇప్పటి వరకు శిస్తు బకాయిలు చెల్లించకపోవడంతో ఓఎన్జీసీ ఈడీకి ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన కరువైందని వాపోయారు. రావాల్సిన శిస్తు బకాయిలు చెల్లించాలంటూ వినతిపత్రాన్ని ఆర్డీవోకు సమర్పించారు. కార్యక్రమంలో రేకాడి శ్రీనివాసరావు, కానుబోను సత్యవతి, కొల్లు శ్రీనివాసరావు, నల్లి నాగమణి, కొల్లు వెంకటరెడ్డి, కానుబోను కృష్ణారావు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ అమానుషం

ఐ.పోలవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి నియోజకవర్గం మల్లం గ్రామంలో దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేయడం అమానుషమని వైసీపీ ముమ్మిడివరం నియోజరవర్గ దళిత నాయకులు తాళ్ళూరి ప్రసాద్, మచ్చా నాగబాబు, నాతి నాగేశ్వరరావు ఆరోపించారు. కారకులపై అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలన్నారు.

కొబ్బరి ప్రత్యేక బోర్డు ఏర్పాటుచేయాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొబ్బరి కార్మికులకు ప్రత్యేకంగా కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక మహానాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు సోమవారం అమలాపురం ఎంపీ గండి హరీష్‌మాధుర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 50ఏళ్ల దాటిన కొబ్బరి కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. కోనసీమలో కొబ్బరి పరిశ్రమలు ఏర్పాటుచేయడంతో పాటు మార్కెటింగ్ సదుపాయానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే దేవ



స్లూయిస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంకలో అధ్వానస్థితిలో ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం పరిశీలించారు. స్థానిక గ్రామస్తులు, కూటమి నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోదావరి పోటు సమయంలో ఉప్పునీరు పంట పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతింటున్నాయని, పంటచేలు ఉప్పునీటి ముంపునకు గురి కాకుండా చర్యలు తీసుకుని, తలుపులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దేవకు విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ప్రత్యేక అనుమతులు తీసుకుని పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిగిలిన సమస్యలపై రానున్న రోజుల్లో పరిష్కరిస్తానని తెలిపారు. ముందుగా రేపూరి రాజేశ్వరి ఇంటి వద్ద గ్రామస్తులు, అధికారులతో సమావేశమై పలు సమస్యలపై సమీక్షించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్, నీటిసంఘ అధ్యక్షుడు నామన నాగభూషణం, రేపూరి ఏసు, గునిశెట్టి రాంజీ, కొండా కిశోర్, ముచ్చర్ల వెంకటేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెరాల్డ్ నిందితులను అరెస్టు చేయాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులతో ఏర్పాటుచేసిన నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తులను హస్తగతం చేసుకున్న వారిని తక్షణం అరెస్టు చేయాలని బీజేవైఎం జిల్లాశాఖ అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన చేపట్టారు. బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2013లో నమోదైన ఈడీ కేసులో నిందితులుగా ఉన్న సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు జగతా శాంతి, రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాసిన ఫణీంద్ర, వెత్సా దుర్గాప్రసాద్, వల్లభనేని రవీంద్రబాబు, విళ్ల దొరబాబు, జవ్వాది తాతబాబు, అడపా శ్రీను, బొంతు శివాజీ, కట్టా నారాయణమూర్తి, కొత్తపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న యువమోర్చా నాయకులు

ఉపాధ్యాయ పోస్టుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ దివ్యాంగ మహాసంఘటన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొడ్డిపట్ల శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ పోస్టుల నియామక ప్రక్రియలో దివ్యాంగులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రకటించిన పోస్టుల్లో 800 దివ్యాంగులకు కేటాయించాలన్నారు. నిమ్మకాయల సురేష్, పెనుమాల నాగసుబ్రహ్మణ్యం, ర్యాలి శ్రీనివాస్, నాగవరపు పరశురాముడు, కె.నాగరాజు కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

సేంద్రియ సాగుతో భూసారాన్ని సంరక్షిద్దాం

అమలాపురం రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ వ్యవసాయ విధానాలను పాటిస్తూ భూసారాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ రైతుపై ఉందని మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్ పేర్కొన్నారు. నల్లమిల్లిలో రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్, ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా సోమవారం నిర్వహించిన సభకు సర్పంచ్ గోకరకొండ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఏవో ధర్మప్రసాద్, మండల రైతుసంఘ అధ్యక్షుడు అప్పారి వెంకటరమణ మాట్లాడారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అభ్యుదయ రైతులు అప్పారి సుబ్రహ్మణ్యం, గోకరకొండ సత్యానందం, విప్పర్తి సత్యనారాయణలను సత్కరించారు. సేంద్రీయ సాగుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది ఎ.కృష్ణప్రశాంతి, ఎం.రమేష్, ఎ.కళావతి, మణి, రమణాతి పల్లయ్యశెట్టి, బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకరరావుకు సన్మానం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై తొలిసారిగా అమలాపురం విచ్చేసిన కామన ప్రభాకరరావును నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేకేసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంటెద్దు బాబి, నాయకులు అయితాబత్తుల సుభాషిణి, అప్పన శ్రీరామకృష్ణ, మాచవరపు శివన్నారాయణ, ఏలేశ్వరపు రాధాకృష్ణ, సంగీతం సత్యనారాయణ, సుగ్గు ప్రసాద్, మీసాల బాబి, కుడుపూడి శ్రీనివాసరావు, షకీలా తదితరులు పాల్గొన్నారు.

వీవర్స్ కాలనీకి తాగునీరు ఇప్పించండి

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి వీవర్స్ కాలనీకి తాగునీరు ఇప్పించాలంటూ గ్రామ సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం గ్రామంలో 1.50లక్షల లీటర్ల వాటర్ ట్యాంకు ఉందన్నారు. ట్యాంకు కోసం పంచాయతీ ఆరు సెంట్ల స్థలాన్ని కేటాయించిందన్నారు. అధికారులు దృష్టి పెట్టి ఈ సమస్యను పరిష్కరించి, చేనేత కార్మికులకు తాగునీరివ్వాలని కోరారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

మలికిపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవడంతో పాటు సేవా కార్యక్రమాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ సినీ నటుడు కేవీ ప్రదీప్ అన్నారు. సోమవారం మలికిపురం డిగ్రీ కళాశాలలో స్పందన ఈద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుటుంబ వ్యవస్థ, విద్యార్థుల భవిష్యత్తు గురించి వివరించారు. స్పందన ఈద సంస్థ ఛైర్మన్ ఈద శామ్యూల్‌రెడ్డి, అంజిరెడ్డి, చంద్రికారెడ్డి, సత్యశ్రీనివాస్, కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ ఆనంద మహానీ, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, గెద్దాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఆక్రమణలు తొలగించండి

పి.గన్నవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ప్రధాన పంటకాల్వ చెంతనే ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు షాపుల నిర్వాహకులకు సూచించారు. సోమవారం మూడు శాఖల అధికారులు, సిబ్బంది షాపులు వద్దకు వెళ్లి ఈనెలాఖరులోగా తొలగించాలని ఆదేశాలు జారీచేశారు. ప్రధాన పంటకాల్వ చెంతనే రక్షణగోడ నిర్మాణం కోసం ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించారు.

సమస్యల పరిష్కారానికి 28నుంచి సమ్మె

పి.గన్నవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28వ తేదీ నుంచి నివరధిక సమ్మెకు దిగుతామని ఫీల్డ్‌అసిస్టెంట్లు తెలిపారు. సోమవారం ఎంపీడీవో కేడీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కనీసం వేతనం రూ.26వేలు వరకు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు ఆకుల నాగప్రసాద్, ఉపాధ్యక్షుడు సీహెచ్ సీమయ్య, పి.వల్లపరాజు, వెంగళ్లరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, నక్కా శ్రీనివాస్, జానికిరామయ్య, కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

ఉత్తమ రైతు అవార్డు

ముమ్మిడివరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగరపంచాయతీ పల్లిపాలేనికి చెందిన అభ్యుదయ రైతు కోట్ల వెంకటశ్రీరామారావు (బుజ్జి) సోమవారం అమలాపురంలోని జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. ఈఅవార్డు, ప్రశంసా పత్రాన్ని ఆయన జిల్లా ఉద్యానశాఖ అధికారి నుంచి అందుకున్నారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ అధికారిణి లక్ష్మీప్రసన్నతో పాటు పలువురు పాల్గొన్నారు.

విత్తనాలు వేయడం వల్ల అనేక లాభాలు

రాజోలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు కోసిన తరువాత రైతులు వరి చేలల్లో 21రకాల విత్తనాలు వేడయం వల్ల అనేక లాభాలు పొందవచ్చునని తాటిపాక యూనిట్ ఇన్‌చార్జి పి.ప్రసన్నకుమార్ తెలిపారు. తాటిపాక యూనిట్ వేగివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్ 2025లో మహిళా సంఘాల సభ్యులకు ఆర్ఏస్కే సిబ్బంది వీఏఏ, వీహెచ్ఏలతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు స్టాల్ ప్లాట్ చూపించామని తెలిపారు. ఆదర్శ రైతులు మామిడిశెట్టి సుబ్రహ్మణ్యం, కడలి రాజు, ఐసీఆర్పీలు కె.భవానీ, నాగదుర్గ, గౌరీ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు జ్ఞాపికలు అందజేత

రాజోలు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ జె.శాంతకుమారి తెలిపారు. సోమవారం అభినందన సభ నిర్వహించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఆర్.జ్ఞానేశ్వరి, ఎస్‌జే ఇవంజెలిన్, ఎం.సాయిశ్రీ, ద్వితీయ సంవత్సరం బైపీసీలో వి.తేజస్వినిసత్య, ఎంపీసీలో ఎండీ హెచ్‌హెచ్ కానూన్, సీఈసీ గ్రూపులో కె.వినయ్, హెచ్ఈసీ గ్రూపులో యు.లోకేష్‌లు ఉత్తమఫలితాలు సాధించినందుకు జ్ఞాపికలు, షీల్డులను అందజేశారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు అద్దె చెల్లించలేదని ఫిర్యాదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి రామలింగరాజునగర్‌కు చెందిన గుబ్బల గణేష్‌వర్మ నుంచి ఈదరపల్లి గ్రామానికి చెందిన గల్లా శివ, అరిగెల శివ, అంబాజీపేటకు చెందిన ఆదిత్యలు కారును అద్దెకు తీసుకుని అన్నవరం దేవస్థానానికి వెళ్లారు. అద్దె చెల్లించకపోగా కారును డ్యామేజ్‌చేసి విడిచిపెట్టి వెళ్లిపోవడంతో గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అద్దెకు తీసుకున్న వారిపై కేసు నమోదుచేసినట్టు పట్టణ సీఐ తెలిపారు.

దొరబాబుకు ఘన సన్మానం



మేకల శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, డీసీ ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం కెయిర్న్-వేదాంత సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మేకల శ్రీనివాసరావు(దొరబాబు), లక్ష్మీకల్పన దంపతులను స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఎస్.యానాం బీచ్‌లో ఘనంగా సన్మానించారు. దొరబాబు దంపతులను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా వెండి కిరీటం, గజమాలతో సత్కరించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ పినిశెట్టి నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప్పలగుప్తం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు, ఆమూడా ఛైర్మన్ అల్లాడి స్వామినాయుడు, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పలచోళ్ళ పద్మనాభం, కల్వకొలను తాతాజీ, అరిగెల నానాజీ, పలచోళ్ళ నారాయణరావు, పలచోళ్ళ బుజ్జి, ఇసుకపట్ల రఘుబాబు, సత్తి చిన్నా, సర్పంచ్ జోగి రాజేశ్వరీరాజా, ఎంపీటీసీ పెట్టా అప్పారావు, ఉలిశెట్టి దొరబాబు, పొగాకు శ్రీను, మంచెం బాలకృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు

మలికిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి, అధిక శక్తి నిచ్చే ఆహారం తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్టు రాజోలు సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. సోమవారం మలికిపురం, కత్తిమండ, మోరిపోడు తదితర గ్రామాల్లో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలు నిర్వహించారు. అధిక శక్తినిచ్చే ఆహార పదార్థాల వంట ప్రదర్శనలు, చౌకగా లభించు ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. సూపర్‌వైజర్లు కె.చంద్రకళ, ప్రసన్నరాణి, హైమావతి, సరోజిని, సర్పంచ్‌లు గెడ్డం రాజ్యలక్ష్మి, ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి, ఎంపీటీసీలు జక్కంపూడి శ్రీదేవి, కె.సీతామహాలక్ష్మి, బళ్ల సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, తల్లిదండ్రుల కమిటీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ముమ్మిడివరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారంతా ముమ్మిడివరంలో అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. తొలుత ముమ్మిడివరంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మికి వినతిపత్రం అందించారు. అనంతరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని జిల్లా ట్రెజరర్ బి.రామనాథంకు వినతిపత్రాన్ని అందించారు. జిల్లా అధ్యాపకుల సంఘం విశ్రాంత ప్రిన్సిపాల్ కోలా వెంకటేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకులు బొక్కా విష్ణుమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు జనిపల్లి సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు రెడ్డి వీరాస్వామి, పెద్దిరెడ్డి రాము పాల్గొన్నారు.

టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడిగా ఫణికుమార్



అమలాపురం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పేరూరు గ్రామకమిటీ అధ్యక్షునిగా రెండోసారి మంధా ఫణికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళిల సూచనలతో గ్రామంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఫణికుమార్ టీడీపీ జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా కూడా పనిచేస్తున్నారు. గ్రామకమిటీ ఉపాధ్యక్షునిగా ఎంవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా అప్పారి ఆదినారాయణలను నియమించారు.

ఏపీ టీచర్స్ ఫెడరేషన్ బడిబాట ప్రచారం

అల్లవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం బడిబాట ప్రచార కార్యక్రమాన్ని తహశీల్దార్ ఎంవీవీ నరసింహం ప్రారంభించారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి బడిబాట మంచి కార్యక్రమమన్నారు. మండల విద్యాధికారి కె.కిరణ్‌బాబు, మండల విద్యాధికారి-2 ఎస్.ఏడుకొండలు, ఏపీటీఎఫ్ జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ గుత్తాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి'



రాయవరం హైస్కూల్‌లో విద్యార్థులను చేర్పిస్తున్న ఎంఈవో, తదితరులు

రాయవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లల్ని తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో వై.సూర్యనారాయణ సూచించారు. సోమవారం రాయవరంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్ల లోపు వయస్సు గల బడిఈడు పిల్లలతో పాటు చదువు మధ్యలో మానేసిన పిల్లలను తల్లిదండ్రులు చొరవ తీసుకుని తిరిగి బడిలో చేర్పించాలన్నారు. రాయవరం మోడల్ ప్రైమరీ స్కూల్, బేసిక్ ప్రైమరీ స్కూల్, వెలమపేట ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసిన 38 మంది విద్యార్థులను రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. లొల్ల ఎంపీ యూపీ స్కూల్‌లో హెచ్ఎం కొవ్వూరి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, టీడీపీ నేత సుంకవిల్లి గంగరాజు, ఉపాధ్యాయులు చంద్రకళ, జేఆర్ కృష్ణవేణి, దండు రాంబాబు, రాయవరం హైస్కూల్‌లో హెచ్ఎం విపర్తి శాంతి సునీత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం వద్ద రైతుల నిరసన



చెల్లూరులో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రాయవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చెల్లూరులో రైతులు పండించిన పంటను చెల్లూరు, చుట్టుపక్కల గ్రామాల్లో రైస్‌మిల్లుల వద్ద కొనుగోలు చేసే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు మాట్లాడుతూ మండలంలో పలు రైస్‌మిల్లులు సీఎం ఆర్ ద్వారా కొనుగోలు చేపట్టకపోవడం వల్ల రైతులు సమస్యను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏవో కె.ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు : ఆర్డీవో



మండపేటలో సమీక్షిస్తున్న ఆర్డీవో అఖిల, తదితరులు

మండపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేయాలని, వారిని ఇబ్బందులకు గురిచేయొద్దని రామచంద్రపురం ఆర్డీవో అఖిల అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో అఖిల, జిల్లా సివిల్ సప్లయి అధికారి బాలసరస్వతి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. దీనికి తహశీల్దార్, వ్యవసాయశాఖ, రైతుసేవా కేంద్రం ఉద్యోగులు హాజరయ్యారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆర్డీవో ఆదేశించారు. అనంతరం పలు సూచనలు చేశారు. సమావేశంలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం తహశీల్దార్లు, పి.తేజేశ్వరరావు, పి.చిన్నారావు, ఐపీ శెట్టి, మూడు మండలాలకు చెందిన ఏవోలు రైతుసేవా కేంద్రాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో, తహశీల్దార్ స్థలపరిశీలన



మండపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేశవరం రోడ్డు, హైస్కూల్‌కు మధ్య వున్న స్థలంలో ఇళ్లను క్రమబద్ధీకరించే దానిలో భాగంగా సోమవారం రామచంద్రపురం ఆర్డీవో అఖిల. తహశీల్దార్ పి.తేజేశ్వరరావుతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ జీవో 30 మేరకు గ్రామంలో ప్రభుత్వానికి చెందిన స్థలంలో వున్న 24 ఇళ్లకు సంబంధించిన భూమిని క్రమబద్ధీకరించే విషయంలో భాగంగా సాధ్యాసాధ్యాలను ఆర్డీవో పరిశీలించారు. సర్వేయర్ డీటీ శ్రీనివాస్, తదితరులు వున్నారు.

కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకరరావుకు సన్మానం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై తొలిసారిగా అమలాపురం విచ్చేసిన కామన ప్రభాకరరావును నియోజకవర్గ పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా సత్కరించారు.

రైల్వే అధికారులు అందుబాటులో ఉండాలి

• ద్వారపూడి రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే



రైల్వేస్టేషన్‌లో అధికారితో మాట్లాడుతున్న ఎంపీ హరీష్ మాధుర్, తదితరులు

మండపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ద్వారపూడి రైల్వేస్టేషన్‌ను అమలాపురం ఎంపీ జీ. హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే స్టేషన్‌లో రైల్వే అధికారులెవరూ లేకపోవడంతో వారిద్దరు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా స్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. స్టేషన్‌మాస్టర్‌తో సహా ఐదుగురు ఉద్యోగులు విధుల్లో ఉండాల్సి ఉండగా, కేవలం ఒకరు మాత్రమే ఉండడం, మరో నలుగురు సెలవుపై వెళ్లారని ఉన్న ఉద్యోగి చెప్పటంతో ఎంపీ మండిపడ్డారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, కూటమినేతలతో కలిసి స్టేషన్‌లో కలియ తిరిగారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైల్వే అధికారులు ప్రయాణికులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు, మండపేట మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జీ, గోణం పుల్లయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ చేకూరి భాస్కరరాజు, లాజర్, తాణింకి చంద్రశేఖర్, సత్తి సత్యనారాయణ, పసగాడ శ్రీను, కూటమినేతలు, తదితరులు వున్నారు. అనంతరం ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను నిలుపుదల చేయాలంటూ కూటమి నేతలు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, మురళీకృష్ణ తదితరులు ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే మండపేటలో ఇండోర్‌స్టేడియం నిర్మించే ప్రదేశాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల, ఎంపీ జీ. హరీష్ మాధుర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు.

సోమేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం



కె.గంగవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సుందరపల్లిలో నిర్మాణంలో ఉన్న ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన చిలకా సత్యనారాయణ రూ. లక్ష విరాళాన్ని సోమవారం అందజేశారు. ఆలయ నిర్మాణం గురించి తన మిత్రుడు కాటూరి వీర్రాజు ద్వారా తెలుసుకుని కమిటీ సభ్యుడు శీరెడ్డి సత్తిబాబుకు చెక్కును అందజేశారు. వీర్రాజు, ఆయన మిత్రుడు, దాత సత్యనారాయణను గ్రామస్థులు అభినందించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

కె.గంగవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. సోమవారం కుందూరు పంచాయతీ కార్యాలయం వద్ద పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షత వహించారు. దీనిలో భాగంగా పది మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. సర్పంచ్ పంపన సత్యానందం పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : ఎమ్మెల్యే వేగుళ్ల



కపిలేశ్వరపురంలో శానిటేషన్‌పై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, ఇతర అధికారులు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నకుమారి, తహశీల్దార్ చిన్నారావు, ఈవోపీఆర్డీ మోహన్, ఏవో రాజేంద్రప్రసాద్, సర్పంచ్ సాకా శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'



మాచరలో కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారని ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం మాచరలో ఎంపీ ల్యాడ్స్ రూ. 40 లక్షలతో నిర్మించనున్న ఓసీ కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణతో కలిసి ఎంపీ , ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ శీలం సూర్య కుమారి, బీసీ సంక్షేమ డైరెక్టర్ గుడాల జయబాబు, సర్పంచ్‌లు సాకా శ్రీనివాస్, ఆచంట సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు పువ్వల చిట్టిబాబు, పుత్సల శ్రీనివాస్, నెక్కంటి శ్రీరాంజీ, పంచాయతీరాజ్ డీఈ రాంబాబు, జేఈ కొండలరావు, రాఘవులు, ఎంపీడీవో రత్నకుమారి, తహశీల్దార్ చిన్నారావు, ఈవోపీఆర్డీ మోహన్, కార్యదర్శి చినబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌కు సన్మానం



మోహన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఏపీఎన్జీవో అసోసియేషన్ మండపేట యూనిట్ నూతన కార్యదర్శిగా కోఆప్షన్ ద్వారా ఎంపికైన ఆర్ఎంపీవీఎస్ ఈశ్వరరావు (మోహన్)ను సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జుత్తుగ మల్లిఖార్జునుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నూతన కార్యదర్శి మోహన్‌కు పూలమాలలతో శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నకుమారి, తహసీల్దార్ చిన్నారావు, సీడీపీవో గజలక్ష్మి, ఏవో రమేష్‌కుమార్, కార్యదర్శులు శివచక్రవర్తి, కామేశ్వరరావు, సత్తిబాబు, తదితరులు, వివిధశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మలేరియా నివారణ అధికారి వెంకటేశ్వరరావు

కె.గంగవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ, మలేరియాపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎన్. వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పామర్రు ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా డెంగ్యూ, మలేరియా నివారణకు తీసుకుంటున్న చర్యలపై పరిశీలించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆసుపత్రి వైద్యులు పి. హర్షిత, పి. విష్ణువర్ధన్, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం రాజ్యాంగానికి విరుద్ధం

పలుచోట్ల ముస్లింల నిరసన ర్యాలీలు
రెవెన్యూ అధికారులకు వినతులు



రావులపాలెం తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ముస్లింలు

రావులపాలెం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో కొత్తపేట నియోజకవర్గ ముస్లీం ఐక్యవేదిక ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టం అమలుకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 25, 28, 30లకు విరుద్ధంగా, మత సామరస్యానికి వ్యతిరేకంగా వక్ఫ్ చట్టం అమలు చేసేందుకు సిద్ధపడుతున్నారంటూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ చట్టం ముస్లింల భూములను కబళించే విధంగా ఉన్నాయని ఈ చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్యవేదిక కన్వీనర్ షేక్ అన్సారి, మేలుకో ఆంధ్ర సభ్యులు థామస్ పల్లేతానం, కమ్యూనిస్టు నేత కొండ దుర్గారావు, కారెం వెంకటేశ్వరరావు, వలీయా అన్నారు. తహశీల్దారు కార్యాలయానికి చేరుకుని తహశీల్దారు ముక్తేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

ద్రాక్షారామ(రామచంద్రపురం): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ బిల్లు జీవో నెం.25ను వ్యతిరేకిస్తూ ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని రామచంద్రపురం, ద్రాక్షారామ, దొడ్డపేట, గొల్లపాలెం చేదువాడ, కాజులూరు, అముజూరు, పసలపూడి గ్రామాలకు చెందిన ముస్లింలు ర్యాలీ పాల్గొన్నారు. ద్రాక్షారామలోని యానాం సెంటరు నుంచి బయలుదేరి రాజగోపాల్ సెంటరుకు చేరుకుని మానవహారం నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వక్ఫ్ సవరణలో లోపాలను వివరించి ఆర్డీవో అఖిలకు వినతిపత్రం అందజేశారు. రామచంద్రపురం వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలి

ఎమ్మెల్యే బండారు



ఉపాధ్యాయురాలు గౌరీకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలందరూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వ పాఠశాలలో చేరాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస్‌పేటలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలందర్నీ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జి, వాసంశెట్టి సత్యనారాయణ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనది

అలాగే వాడపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిగా పనిచేసిన గౌరీకృష్ణ పదవి విరమణ సభకు ఎమ్మెల్యే బండారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతతో పాటు గౌరవ ప్రదమైనదని అన్నారు. గౌరీకృష్ణ విద్యాబోధనలో ఎంతో ప్రతిభావంతురాలుగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆమె శేషజీవితం సంతోషదాయకంగా గడవాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా గౌరీకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎం ఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, హెచ్ఎం వై.చంద్రశేఖర్, సర్పంచ్ త్సామా ఆదినారాయణమూర్తి(బాబు), వైస్ సర్పంచ్ ఎన్.సూర్యకాంతం, ఎస్ఎంసీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందస్వామి, కె.సుబ్బారావు, ప్రకాశరావు, హేమసుందరీ పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ

రావులపాలెం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ ఎంపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా విద్యార్థులకు ఉపకరణాలు అందజేశారు. ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, గుత్తుల పట్టాభిరామారావు, ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంఈవో శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం

మంత్రి సుభాష్



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు నమస్కరిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, భారతదేశ మాజీ ఉపప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ నేటితరానికి ఆదర్శప్రాయులని, వారి అడుగుజాడల్లో మనమంతా నడుచుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు సంబంధించి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో మహనీయులు ఎంతోమంది జన్మించారని గుర్తుచేశారు. వారి సేవలు వెలకట్ట లేమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఆకుల నారాయణరావు, ఎస్ఎల్‌టీ అధినేత దూడల శ్రీనివాస్, దడాల నాగభూషణం, ఆకుల సతీష్, కె.రాముడు, లంక మహేష్, సురేష్, వసంతరావు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠురోగులకు నిత్యావరాల అందజేత

ద్రాక్షారామ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఉండూరు గ్రామంలో బేతస్థ సోషల్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కుష్ఠు రోగులు 50మందికి నిత్యావసర వస్తువులను సంస్థ సభ్యులు అందించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొని వారికి ఆరోగ్య విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాజ్‌కుమార్, కార్యదర్శి చక్కపల్లి రామకృష్ణ, మానుపాటి ప్రసాద్ అడబాల సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుకు విత్తన తయారీపై అవగాహన



ఆత్రేయపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుకు విత్తన తయారీపై కొత్తపేట వ్యవసాయ శాఖ ఏడీఏ రామారావు రైతులకు వివరించారు. సోమవారం అంకంపాలెం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద విత్తన ఎంపికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరం పొలంలో 20 రకాల విత్తనాలు వేయడం వల్ల వ్యవసాయ భూమిలో భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం పీఎం డీఎస్ కిట్లు, నవధాన్యాలను రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులకు సత్కారం



మెర్లపాలెం జడ్పీ హైస్కూల్ క్రీడాకారులను సత్కరించిన దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. సోమవారం మెర్లపాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి నెట్‌బాల్, త్రోబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీలలోను విశేష ప్రతిభ చూపించారు. హైస్కూల్ కమిటీ చైర్మన్ పువ్వల లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ మెర్ల రాము పాల్గొని ఘనంగా సత్కరించారు. దాతలు విరాళాలతో సత్కరించగా వచ్చిన జ్ఞాపికలు, పతాకాలతో సత్కరించారు. కార్యక్రమంలో మల్లవరపు నాగరాజు, మెర్ల లక్ష్మిపతి, హెచ్ఎం శ్రీహరి, పీఈటీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



కోర్టు వరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ద్రాక్షారామ(రామచంద్రపురం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని అంబజోగాయిలలో సెషన్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవాదిపై జరిగిన దాడితోపాటు కర్ణాటకలోని బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహాధ్యక్షుడు వైఆర్ సదాశివరెడ్డిపై ఈ నెల17న జరిగిన దాడిని నిరసిస్తూ రామచంద్రపురం న్యాయస్థానంలో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. కోర్టు ప్రాంగణంలో నినాదాలు చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు, కార్యదర్శి బి.నరసింహమూర్తి, చింతపల్లి శ్రీనివాసరావు, పీవీవీ జానకి, శేషకుమార్, లాఖాని పద్మకమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం కార్యదర్శి సాయిరామ్ మృతి



రావులపాలెం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం గోపాలపురం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న నిమ్మకాయల సాయిరామ్ (54) మృతిచెందారు. ఆయన అనారోగ్య కారణాలతో రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. సాయిరామ్ మృతి పట్ల పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

వాడపల్లి వెంకన్నకు అష్టోత్తర పూజలు



ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్క రోజు ఆదాయం రూ.2,70,353 లభించినట్లు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి పి.గన్నవరం గ్రామానికి చెందిన కట్టా విజయకుమార్- శ్రీలత దంపతులు రూ.50 వేలు విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.